ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
బుధవారం 15 మే 2024


నెల్లూరులోని ప్రియదర్శిని కాలేజీకి చేరుకున్న ఈవీఎం యంత్రాలను స్ట్రాంగ్ రూములకు తరలిస్తున్న సిబ్బంది

మండలం	ఓట్లు	పోలైనవి	శాతం
ఆత్మకూరు	52,981	42,894	80.96
చేజర్ల	27,887	24,672	88.47
ఏఎస్‌పేట	27,643	23,374	84.56
అనంతసాగరం	35,702	29,758	83.35
సంగం	35,824	30,210	84.33
మర్రిపాడు	35,364	28,921	81.78
నెల్లూరు రూరల్	2,80,888	1,90,347	68.0
నెల్లూరు సిటీ	2,39,544	1,71,763	71.72
వెంకటాచలం	52,285	44,290	84.71
తోటపల్లిగూడూరు	41,593	36,127	86.86
పొదలకూరు	59,937	48,553	81.01
ముత్తుకూరు	45,965	38,154	83.01
మనుబోలు	32,231	27,494	85.30
కందుకూరు పట్టణం	47,431	40,147	84.64
కందుకూరు రూరల్	30,605	27,983	91.43
వలేటివారిపాలెం	35,274	31,932	90.53
లింగసముద్రం	30,953	28,015	90.51
గుడ్లూరు	39,760	35,977	90.49
ఉలవపాడు	44,890	39,583	88.18
కోవూరు	65,047	46,579	71.06
బుచ్చిరెడ్డిపాళెం	70,602	53,664	76.01
కొడవలూరు	41,300	33,080	80.09
విడవలూరు	41,880	33,776	80.78
ఇందుకూరుపేట	48,516	41,617	85.78
కావలి అర్బన్	83,239	63,478	76.26
కావలిరూరల్	43,028	38,695	89.93
బోగోలు	39,237	33,007	84.12
అల్లూరు	42,638	35,817	84.0
దగదర్తి	30,411	27,069	89.01
వింజమూరు	33,360	26,278	78.7
సీతారామపురం	19,848	15,290	77.03
జలదంకి	33,375	32,755	87.63

ఉదయగిరి, వరికుంటపాడు, కొండాపురం, కలిగిరి, దుత్తలూరు మండలాల నుంచి పోలింగ్ వివరాలు వెల్లడించలేదు.


ఉదయగిరి బస్టాండ్ సెంటర్‌లో బస్సుల కోసం వేచి ఉన్న వలసవాసులు


కలువాయిలో బారులు తీరిన మందుబాబులు


మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు క్యూలైన్‌లో ఉన్న ఓటర్లు

ఓటేశాం.. ఇక వెళ్లొస్తాం !

ఓటు వేసేందుకు స్వగ్రామాలకు తరలివచ్చిన వలసవసులు మంగళవారం తిరుగు పయణమయ్యారు. తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆదివారం స్వగ్రామాలకు వచ్చారు. సోమవారం ఓటు వేసి మంగళవారం తిరుగు ప్రయాణమయ్యారు. అయితే, బస్సుల కొరత కారణంగా ఉదయగిరి బస్టాండ్ సెంటర్‌లో వారికి నిరీక్షణ తప్పలేదు. అలాగే ప్రత్యేక వాహనాల్లో వచ్చిన వారు ఓటు వేసిన అనంతరం తిరిగి బయలుదేరగా రోడ్డ వెంట ట్రాఫిక్ ఆగిపోవడంతో ఇబ్బందులు పడ్డారు.

- ఉదయగిరి

రెండ్రోజుల తర్వాత మద్యం!


ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో రెండు రోజులుగా మూతపడిన ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లు మంగళవారం ఉదయం ఓపెన్ అయ్యాయి. శనివారం సాయంత్రం మద్యం దుకాణాలకు ఎక్సైజ్ అధికారులు సీల్ వేశారు. పోలింగ్ ప్రక్రియ పూర్తికావడంతో సోమవారం సాయంత్రం 7 గంటల సమయంలో మద్యం దుకాణాలు, బార్లు తెరుస్తామని అధికారులు ప్రకటించారు. అయితే, పోలింగ్ ప్రక్రియ ఆలస్యం కావడంతో కలెక్టర్ ఆదేశాలతో దుకాణాలు తెరవలేదు. రెండు రోజులపాటు మద్యం కోసం ఎదురు చూస్తున్న మందుబాబులు మంగళవారం ఉదయం దుకాణాల తలుపులు తెరవకముందే క్యూ కట్టారు. ఆ తర్వాత పోటీపడి మద్యం కొనుగోలు చేశారు.

- నెల్లూరు (క్రైం)

తోటపల్లిలో తెల్లవారుజాము వరకు పోలింగ్

తోటపల్లిగూడూరు మండలం తోటపల్లి పోలింగ్ కేంద్రంలో (99) మంగళవారం తెల్లవారుజాము 3.30 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. ఇక్కడ 1150 మంది ఓటర్లు ఉండగా 1039 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గది ఇరుకుగా ఉండటం, ఈవీఎంలు సరిగా పనిచేయకపోవడం, వృద్ధులు అభ్యర్థుల గుర్తులు ఎంచుకునే సమయంలో జరిగిన ఆలస్యం తదితర కారణాలతో ప్రక్రియ ఆలస్యమైంది. మరోవైపు 144 సెక్షన్ నిబంధనలు అమలు కాకపోవడంతో ఏజెంట్లు, స్థానిక నేతలు అధికారుల సూచనలను గాలికి వదిలేశారు. మొత్తం మీద తోటపల్లి పోలింగ్ ప్రక్రియ తెల్లవారుజాము వరకు జరగడం చర్చనాయాంశంగా మారింది.

- తోటపల్లిగూడూరు



భారీ పోలింగ్.. లాభం ఎవరికి!?

ఓటు వేసేందుకు తరలివచ్చిన జనం • తెల్లవారుజాము వరకూ క్యూలైన్‌లోనే..

పోస్టల్ బ్యాలెట్‌దీ అదే పరిస్థితి • విజయంపై ఇరు పార్టీల ధీమా

నెల్లూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నమోదైన భారీగా పోలింగ్ ఎవరికి లాభం.. ఎవరికి నష్టం..? అన్న చర్చలు రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతున్నాయి. గెలుపుపై ఎన్డీఏ కూటమి, వైసీపీ పక్షాలు ధీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ రాజకీయ విశ్లేషకులు మాత్రం గత చరిత్రను విశ్లేషిస్తూ అంచనాలు వెల్లడిస్తున్నారు. ఇదే ఇప్పుడు అన్ని వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. రాష్ట్ర విభజనకు ముందు ఏపీలో సరాసరి 70 శాతం పోలింగ్ జరిగేదని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. విభజన నేపథ్యంలో అనుభవజ్ఞుల పాలన అవసరమని భావించిన ప్రజలు భారీగా తరలి వచ్చి ఓటింగ్‌లో పాల్గొన్నారు. దీంతో 2014లో 74 శాతానికిపైగా (పోస్టల్ బ్యాలెట్‌తో కలిపి) ఓటింగ్ జరిగింది. ఆ ఎన్నికల్లో టీడీపీకి మెజారిటీ స్థానాలు దక్కగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇక్కడ ప్రజల ఆలోచన స్పష్టంగా అర్థమైంది. ఆ తర్వాత 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీపై వ్యతిరేకత లేకపోయినా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బిడ్డగా 'ఒక్కచాన్స్' అంటూ అడుగుతున్న జగన్మోహన్‌రెడ్డికి ఆ చాన్స్ ఇచ్చేందుకు సముఖత చూపారు. ఈ కారణంగానే 2019లో 78 శాతానికిపైగా పోలింగ్ నమోదైంది. అంత భారీస్థాయిలో ఓటింగ్ జరగడంతో వైసీపీకి భారీ విజయం చేకూరింది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పదికి పది స్థానాలను వైసీపీ కైవసం చేసుకుంది.

• ఈసారి 80 శాతం?

అయితే ఈ దఫా ఎన్నికల్లో అంతకు మించి పోలింగ్ నమోదైంది. అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం 78 శాతానికిపైగా పోలింగ్ జరగ్గా, పోస్టల్ బ్యాలెట్‌తో కలుపుకుంటే అది 80 శాతం దాటుతుందని అంచనా వేస్తున్నారు. అయితే ఇంత భారీస్థాయిలో ఓటింగ్ జరగడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ప్రజలు ఇంత కసిగా తెల్లవారుజాము వరకు కూడా ఓపిగ్గా క్యూలో నిల్చొని ఓటు వేయడానికి కారణమేమిటబ్బా.. అంటూ ఎవరికి తగ్గ విశ్లేషణలు వారు చేస్తున్నారు. కానీ రాజకీయ విశ్లేషకులు మాత్రం పెరిగిన పోలింగ్ శాతం ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకతను చాటుతోందని అంచనా వేస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఉద్యోగులతో మొదలైన ఈ వేవ్.. సామాన్య ఓటర్లలోనూ కనిపించిందని చెబుతున్నారు. ఉద్యోగులు కూడా గతంలో ఎప్పుడూ లేనంతగా రికార్డు స్థాయిలో 96 శాతానికిపైగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.


నెల్లూరు శివార్లలోని ప్రియదర్శిని కాలేజీలో ఈవీఎంలు ఉంచిన స్ట్రాంగ్ రూం వద్ద బందోబస్తు

• తరలివచ్చిన యువత

ముఖ్యంగా యువత భారీగా ఓటు వేసేందుకు తరలిరావడాన్ని విశ్లేషకులు ప్రత్యేకంగా గుర్తిస్తున్నారు. పరిశ్రమలు, ఉద్యోగాలు, ఉపాధి అన్నది వైసీపీ ప్రభుత్వంలో కనిపించలేదని, మరి యువత ఆ స్థాయిలో ఓటింగ్‌లో పాల్గొన్నారంటే అది వైసీపీపై వ్యతిరేకతతోనేనన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. అందులోనూ ముఖ్యంగా సర్వేపల్లి, నెల్లూరు సిటీ, కావలి, ఉదయగిరి నియోజకవర్గాల్లో గతాని కన్నా నాలుగైదు శాతం ఎక్కువగా పోలింగ్ నమోదవడం గమనార్హం. సాధారణంగా ఓటు వేశాక ఓటరు తన మనసులోని అభిప్రాయాన్ని బయటపెడుతుంటారని, కానీ ఈదఫా అలా జరగలేదని చెబుతున్నారు. దీనిని బట్టి చూస్తుంటే జిల్లా ప్రజలు ఎవరివైపు నిలబడ్డారన్నది జూన్ 4వ తేదీన తేలుతుందని అంటున్నారు.


ఈవీఎం యంత్రాలు ఉంచిన స్ట్రాంగ్ రూమ్ సీల్ పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎంలు

నెల్లూరు(హరనాథపురం), మే 14 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సోమవారం జరిగిన పోలింగ్‌లో ఓట్లు నిక్షిప్తం చేసుకున్న ఈవీఎంలు స్ట్రాంగ్ రూములకు చేరాయి. రాజ కీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సాధారణ పరిశీలకుల సమక్షంలో ఈవీఎంలు, ఎన్నికల స్టాట్యుటరీ మెటీరియల్‌ను పటిష్ఠ బందోబస్తు మధ్య మంగళవారం స్ట్రాంగ్ రూములలో భద్రపరిచారు.

పోలింగ్‌కు వినియోగించిన ఈవీఎం, ఇతర సామగ్రితో


• పటిష్ఠ బందోబస్తు

పోలింగ్ అధికారులు, సిబ్బంది సోమవారం రాత్రి రిసీవింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. కోవూరు, నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, సర్వేపల్లి అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించిన ఈవీఎంలు, పోలింగ్ మెటీరియల్‌ను నేరుగా నెల్లూరులోని కనుపర్తిపాడులో గల ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలకు చేర్చారు. ఆత్మకూరు, ఉదయగిరి, కావలి, కందుకూరు అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన పోలింగ్ సామగ్రిని అక్కడి రిసీవింగ్ కేంద్రాల్లో అప్పగించగా అక్కడి నుంచి ప్రత్యేక కంటైనర్లలో ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలకు తరలించారు. స్ట్రాంగ్‌రూములలో వాటిని భద్రపరిచారు. కలెక్టర్ హరినారాయణన్ సోమవారం రాత్రి నుంచి మంగళవారం స్ట్రాంగ్ రూములలో భద్రపరిచే వరకు అక్కడే ఉండి పర్యవేక్షించారు. వాటిని భద్రపరచిన తరువాత స్ట్రాంగ్ రూములలో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు రామ్‌కుమార్ గౌతమ్, నితిన్ సింగ్ బదూరియా, కే జ్యోతి, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వామ్మో.. 800 కోట్లా!?

- ఒక్కో నియోజకవర్గంలో సరాసరిన రూ.100 కోట్లు
- భారీగా పెరిగిన అభ్యర్థుల ఖర్చులు
- నామినేషన్లకు ముందే మొదలైన హడావిడి
- డబ్బులు కుమ్మరించిన ప్రధాన పార్టీలు
- అధికారిక లెక్కల్లోనూ భారీగానే చిట్టా

నెల్లూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ఖర్చులు భారీగా పెరుగు తున్నాయి. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఖర్చుల మొత్తం రెట్టింపు అయినట్టు తెలుస్తోంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఒక్కో నియోజక వర్గంలో సరాసరి రూ.100 కోట్లకుపైగా ఖర్చులు పెట్టారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజక వర్గాలు, ఎంపీ స్థానం జనరల్ స్థానాలు కావడంతో అభ్యర్థులు పోటీపోటీగా ఖర్చులు పెట్టారు. ప్రధాన పార్టీలు అభ్యర్థులంతా స్వతహాగా ధనవంతులు కావడం కూడా ఖర్చులు పెరగడానికి ఒక కారణంగా విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.



నిబంధనలు ఇవీ..

ఎన్నికల నిబంధనల ప్రకారం జనరల్ అసెంబ్లీ స్థానంలో రూ.40 లక్షలు, జనరల్ ఎంపీ స్థానంలో రూ.95 లక్షల వరకు ఎన్నికల కోసం ఖర్చు పెట్టుకోవచ్చు. అయితే ఈ మొత్తం ఏ కోశాన అభ్యర్థులకు సరిపోలేదు. ప్రధాన పార్టీలకు చెందిన ఒక అభ్యర్థి అసెంబ్లీ స్థానంలో దాదాపు రూ.50 కోట్ల వరకు ఖర్చు చేశారు. ఈ లెక్కలు చూసుకుంటే కళ్లు తిరుగు తున్నా.. ఇది నిజం. చివరి నిముషం లో ఒక్కో ఓటుకు సరాసరి రూ.2 వేల వరకు పంపిణీ చేశారు. ఒక్కో నియోజకవర్గంలో రెండు లక్షల ఓట్లకు డబ్బులు పంపిణీ చేశారు. దీని ప్రకారం చూసు కున్నా రూ.40 కోట్లు ఇక్కడే ఖర్చు చేశారు.

ప్రచారానికే రూ.లక్షల్లో..

మార్చి 16న ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత నుంచి ప్రచారాలు మొదలయ్యాయి. నామినేషన్ల ముందు వరకు ఒక అభ్యర్థికి రోజుకు రూ.5 లక్షల వరకు ఖర్చు ఉండేది. అయితే నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యాక అది రూ.10 లక్షలకు చేరుకుంది. రోజువారీ ప్రచార నిర్వహణ ఖర్చులు, భోజనాలు, ఆఫీసు అద్దెలు, వెంట ఉండే నాయ కుల ఖర్చులు, ఆపదలో ఉండే నాయకులు, కార్యకర్తలకు సాయం చేయడం... ఇలా అనేక రకాల ఖర్చులు రోజూ జరుగుతుండేవి. ఇలా దాదాపు రెండు నెలలపాటు ప్రచా రం జరిగింది. ఇందుకోసమే ఒక్కో అభ్యర్థి దాదాపు రూ.3 కోట్ల నుంచి 5 కోట్లు వరకు ఖర్చు చేసి ఉంటారని అం చనా. ఇలా ఒక్కో నియోజకవర్గంలో రెండు ప్రధాన పార్టీలతోపాటు ఇతర పార్టీలు, స్వతంత్రులు పోటీ చేశారు. వీరందరి లెక్కలను పరిగణలోకి తీసుకుంటే ఒక్కో నియో జకవర్గంలో సరాసరి ఎన్నికల ఖర్చు రూ.100 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. అంటే 8 నియోజక వర్గాలకు కలిపి సరాసరిన రూ.800 కోట్ల వరకు ఖర్చు చేసి ఉంటారని అంచనా.

ఖర్చులపై ఆరా

ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు, వీడియో సర్వేలెన్స్ టీంలు, ఎక్స్‌పెండిచర్ అధికారులు.. రోజూ అభ్యర్థుల లెక్కలను నమోదు చేస్తూ వస్తున్నారు. నామినేషన్ల ముందు వరకూ ప్రచారాల ఖర్చులను పార్టీల లెక్కల్లోకి చేర్చారు. అభ్యర్థి పోటీలో ఖరారయ్యాకనే ఖర్చులను వారి ఖాతాల్లో వేస్తున్నారు. అధికారు లెక్కల ప్రకారం కూడా ప్రధాన పార్టీల అభ్యర్థుల ఖర్చులు బార్డర్ లైన్‌ను దాటాయి. ఖర్చులు పెరుగుతున్న కారణంగానే కొందరు అభ్యర్థులు చివర్లో ప్రచారాలు తగ్గించి ఖర్చులు తగ్గించారు. మొత్తంగా అభ్యర్థులు రాసుకున్న ఖర్చులకు, అధికారులు రాసుకున్న ఖర్చులకు లెక్కలు సరిపోలాల్సి ఉంది. ఎన్నికలు పూర్తయిన 45 రోజుల్లోపు అభ్యర్థులు తమ ఖర్చులను ఎన్నికల అధికారులు సమర్పించాలి. ఏవైనా హెచ్చు తగ్గులు ఉంటే వాటిపై నిర్ణయం తీసుకునే అధికారం కలెక్టర్, ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్‌కు ఉంటుంది.

ఎన్నికల విధుల్లో పస్తులు

అధికారుల తీరుపై అసహనం

వరికుంటపాడు : పోలింగ్ కేంద్రాల్లో ప్రభుత్వ సిబ్బంది రెండు రోజులుగా సరిపడా తిండి లేక అవస్థలు పడ్డారు. నిబంధనల మేరకు రుచికరమైన ప్రత్యేక ఆహారం అందించాల్సి ఉండగా ఆచరణలో చేతులెత్తేశారు. వరికుంటపాడు మండలంలో కనీసం ఏ ఒక్కపూట కూడా మెనూ కనిపించకపోవడంతో అధికారుల తీరుపై సిబ్బంది తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నాసిరకం భోజనం అందించి చేతులు దులుపుకున్నారే తప్ప ఇతర అల్పాహారం గురించి ఏమాత్రం పట్టించుకోలేదనే వాపోయారు. అంతేగాక గంటల తరబడి ఆలస్యంగా సరఫరా చేయడంతో వాసన వస్తున్న ఆ భోజనాన్ని తీసుకునేందుకు అధికశాతం మంది వెనకడుగు వేశారు. చివరకు సొంతంగా ఇతర ప్రాంతాల నుంచి భోజనాలు తెప్పించుకోగా, అలాంటి అవకాశం లేని మరికొంతమంది మాత్రం పస్తులతోనే విధులు నిర్వహించారు.


వరికుంటపాడు : ఓ కేంద్రంలో మిగిలి పోయిన భోజన ప్యాకెట్లు



తుప్పు పట్టిన పరికరాలు

గృహ నిర్మాణ పరికరాలు నిరుపయోగం

- ఆగిన తలుపులు, కిటికీల తయారీ
- పూర్తికాని పక్కా ఇళ్లు

వెంకటాచలం, మే 14 : ప్రభుత్వం నిర్మించే పక్కా ఇళ్లకు సిమెంట్ తలుపులు, కిటికీలు తయారు చేసి, సరఫరా చేసే పరికరాలు అధికారుల నిర్లక్ష్యంతో మూలపడ్డాయి. వెంకటాచలంలో జాతీయ రహదారి పక్కన గతంలో గృహనిర్మాణశాఖ అధ్వర్యంలో గృహనిర్మాణానికి అవసరమైన పరికరాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రానికి సిమెంట్ ఇటుకలు, తలుపులు, ద్వార బంధనాలు, కిటికీలు తయారు చేసే పరికరాలను కూడా అందజేశారు. మండలంలో పక్కా ఇళ్లు నిర్మించుకునే వారికి ఇక్కడి నుంచే అవసరమైన సామగ్రి సరఫరా చేసేవారు. ప్రస్తుతం తయారీ కేంద్రం ఉన్న స్థలంలో ప్రభుత్వం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించింది. దీంతో తయారీ వస్తువులను పక్కన పడేశారు. సిమెంట్ వస్తువుల తయారీ కూడా నిలిపివేశారు. రూ.లక్షలు విలువజేసే పరికరాలు తప్పుపట్టి పోయాయి. ఇక్కడ తయారయ్యే ఇటుకలు, తలుపులు, కిటికీలు, ద్వారబంధనాలు తక్కువ ధరలకు వస్తుండటంతో లబ్ధిదారులకు ఎంతో ఉపయుక్తంగా ఉండేది. ప్రస్తుతం సరఫరా లేకపోవటంతో లబ్ధిదారులకు ఖర్చు పెరుగుతోంది. అధికారులు స్పందించి వాటిని తిరిగి వినియోగంలోకి తీసుకుని రావాలని పక్కా ఇళ్ల లబ్ధిదారులు కోరుతున్నారు.

నిర్మాణ కేంద్రం ద్వారా మంచి ఫలితాలు



సిమెంట్ తయారీ కేంద్రం ద్వారా తయారు చేసిన వస్తువులు పక్కా ఇళ్ల లబ్ధిదారులకు బాగానే సరఫరా చేశారు. అయితే గతంలోనే సిమెంట్ వస్తువుల తయారీ నిలిపి వేశారు.దీంతో పక్కా ఇళ్ల లబ్ధిదారులు బయట ప్రాంతాల నుంచి సిమెంటు ఇటుకలు, ఇతర వస్తువులు తెచ్చుకునే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఇళ్ల నిర్మాణ ఖర్చు కూడా అమంతంగా పెరిగింది.

- డబ్బుగుంట సురేంద్ర, కాకుటూరు

తుప్పుపట్టిన పరికరాలు



గృహ నిర్మాణ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రూ.లక్షలు విలువజేసే సిమెంట్ తయారీ పరికరాలు తుప్పు పట్టాయి. ఈ కేంద్రాన్ని వినియోగంలోకి తెచ్చిన్నల్లుయితే పక్కా ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. అధికారులు ఇప్పటికైనా స్పందించాలి.

- ఈపూరు శరత్‌నాయుడు, పూడిపర్తి

ఆర్టీసీ డ్రైవర్ స్కూటీ దహనం



ఇంటి ఆవరణలో దగ్ధమైన స్కూటీ

కావలి, మే 14: కావలి పట్టణం ఇస్లాం పేట శివారులో నివాసం ఉంటున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ బండి వెంకయ్యకు చెందిన స్కూటీని సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. బాధితుడి కథనం మేరకు.. వెంకయ్య ఎన్నికల విధులలో భాగంగా ఆర్టీసీ బస్సును తీసుకుని ఆత్మకూరుకు వెళ్లారు. ఈ క్రమంలో ఇంటి ఆవరణలో స్కూటీని పార్కు చేశాడు. ఆయన భార్య సోమవారం రాత్రి తలుపులు వేసుకుని ఇంట్లో నిద్రించారు. మంగళవారం ఉదయం చూసే సరికి స్కూటీ పూర్తిగా కాలిపోవడమే కాక సమీపంలో ఉన్న వాషింగ్ మిషన్‌కు కూడా మంగలు అంటుకుని కొంత దెబ్బతింది. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు కావాలనే తగుల పెట్టి ఉంటారని భావిస్తూ ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దాడికి పాల్పడిన వైసీపీ నాయకులపై కేసు నమోదు

అల్లూరు, మే 14 : అల్లూరు నుంచి మూకుమ్మడిగా బీరంగుంటకు వెళ్లి నలుగురు వ్యక్తులపై దాడి చేసిన ఘటనపై ఇరువురు వైసీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి మంగళవారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బీరంగుంటకు చెందిన గుమ్మడి సాయిచరణ్, అల్లూరుకు చెందిన సామంతుల సురేష్‌రెడ్డి మరి కొంత మంది అనుచరులతో కలసి బీరంగుంటకు చెందిన టీడీపీ నాయకులపై దాడి చేసిన విషయం విదితమే. ఈ ఘటనలో నలుగురు టీడీపీ నాయకులకు గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. అయితే మూకుమ్మడిగా వచ్చి తమపై దాడిచేసి గాయపరిచిన ఘటనపై పోలీసులు నామమాత్రము సెక్షన్లు పెట్టి కేసును నిర్వీర్యం చేస్తున్నారని టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

మా పరిస్థితి ఏంటి!?

- కొత్త ప్రభుత్వంలో అవకాశం వస్తుందా!?
- సంకటస్థితిలో వలంటీర్లు



నెల్లూరు (హరనాథపురం), మే 14 : వైసీపీ ప్రభుత్వంలో అన్నీ తామై వ్యవహరించిన వలంటీర్లు ఎన్నికల సమయంలో వేలాదిగా విధుల నుంచి తప్పుకున్నారు. ఇప్పుడు వారి పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉండటంతో ఎంతోమంది యువత రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటైన తరువాత వలంటీర్లుగా చేరారు. నెలకు రూ.5వేల పారితోషికంతో వారు పనిచేశారు. ఒక్కో వలంటీరు పరిధిలో 50 ఇళ్లను కేటాయించి, ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు చేరవేయడం, రేషన్ పంపిణీ వంటి విధులను వలంటీర్లకు కేటాయించారు. ప్రజలతో మమేకమైన వలంటీర్లను ఎన్నికల్లో వినియోగించుకోవడానికి వీలుగా సేవామిత్ర, సేవారత్న, సేవా వజ్ర వంటి పురస్కారాలను ప్రభుత్వం ప్రకటించిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అయితే, ప్రతిపక్షాల ఫిర్యాదుతో ఎన్నికల కమిషన్, వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచింది. అయితే, వలంటీర్ల సేవలను ఎలాగైనా ఉపయోగించుకొని ఎన్నికల్లో లబ్ధిపొందాలన్న వైసీపీ నాయకులు వారితో రాజీనామా చేయించింది. కొందరు అయిష్టత వ్యక్తం చేసినా వారిపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. అయితే, టీడీపీ అధినేత చంద్రబాబు వలంటీర్లకు తాము వ్యతిరేకం కాదని, తమ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత రూ.10వేల పారితోషికం ఇచ్చి పనులు చేయిస్తామని ప్రచారాల్లో హామీ ఇచ్చారు. దీంతో వలంటీర్లుగా పనిచేసి విధుల నుంచి తుప్పుకున్న వారు టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైతే తమను తిరిగి విధుల్లోకి తీసుకుంటారనే ఆశతో ఉన్నారు. రాజీనామా చేసిన వారిని తిరిగి విధుల్లో తీసుకుంటారా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

సచివాలయాలు : 769
వలంటీర్లు : 13,609
రాజీనామా చేసినది : 3,586
విధుల నుంచి తొలిగింపు : 27
విధుల్లో ఉన్నది : 4,383
విధులకు దూరంగా ఉన్నది : 5,613

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	160
లేయర్ లైవ్	105
స్కిన్ చికెన్	280
స్కిన్‌లెస్	310
లేయర్	178

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6889
వెండి కిలో ధర	రూ. 86,600
వెండి ఒక గ్రాము	రూ. 88.60

379 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి, మే 14: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు 410 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 14 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 379 బేళ్లు కొనుగోలు చేశారు. నోసేల్-1, నోబిడ్-19, ఆర్ఆర్-1, సీఆర్-6, జంపింగ్ లాట్స్-4 కారణాలతో 31 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.299, కనిష్ఠ ధర రూ.205, సగటు ధర రూ.259.90గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

రాపూరులో అక్రమ లేఅవుట్లు

రాపూరు(డక్కిలి), మే 14 : రాపూరు మండలంలో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అయినా పట్టించుకొనే నాథుడు కరువయ్యాడని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఏర్వేడు-పెంచలకోన జాతీయ రహదారి వెంబడి టోల్‌ప్లాజా సైదురాసి పల్లి, ఆరపూరు, మద్దెల మడుగు సెంటర్ల వద్ద పలదుల సంఖ్యలో లేఅవుట్లు అక్రమంగా వెలశాయి. వీటికి ఎలాంటి అను మతులు లేకుండానే అమ్మి సొమ్ముచేసుకొంటున్నారు. లేఅవుట్ వేసి ప్లాట్లు విక్రయించాలంటే పంచాయతీల అనుమతి తప్పనిసరి. కానీ వీటిలో ఏ ఒక్కదానికి కూడా అనుమతులు లేవు. లేఅవుట్ వేయాలంటే కొంత భాగం స్థలాన్ని పబ్లిక్‌ప్లేస్ కోసం వదిలి పెట్టాలి. కానీ ఈ నిబంధనలేమీ పాటించకుండా లేఅవుట్లు వెలుస్తున్నాయి. ప్రభుత్వానికి చెల్లించాల్సిన సొమ్ముకూడా చెల్లించకుండా అధికారులను లోబరుచుకొని ప్లాట్లు విక్రయం జోరుగా సాగిస్తున్నారు. రాపూరులో ఇళ్ల ప్లాట్లకోసం జనం ఎగబడటంతో ఈ ప్రాంతంలో రియల్‌ఎస్టేటు వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతుంది. ఇప్పటికైనా అధికారులు అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఇంటర్ ప్రవేశాలు
ప్రారంభం

- నేటి నుంచి దరఖాస్తుల విక్రయం
- రూల్ ఆఫ్ రిజర్వేషన్ పక్కాగా అమలు
- ఆర్ఐవో డాక్టర్ శ్రీనివాసులు



నెల్లూరు (విద్య), మే 14 : ఇంటర్మీడియట్ ప్రవేశాలకు సమయం ఆసన్నమైంది. 2024-25 విద్యా సంవత్సరానికి వివిధ కళాశాలల్లో రెండేళ్ల ఇంటర్మీడియట్ జనరల్, ఒకేషనల్ కోర్సులకు అడ్మిషన్ నోటిఫికేషన్‌ను ఇంటర్‌బోర్డు విడుదల చేసింది. రెండు దశలుగా షెడ్యూల్ చేస్తున్నట్లు ప్రకటించింది. అన్ని కళాశాలల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ కచ్చితంగా పాటించాలని, బోర్డు నిర్ణయించిన ఫీజులు కాకుండా అధికంగా వసూలు చేస్తే చర్యలు తప్పవని ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి (ఆర్ఐవో) డాక్టర్ ఏ శ్రీనివాసులు ఓ ప్రకటనలో హెచ్చరించారు. బుధవారం నుంచి దరఖాస్తుల విక్రయం ప్రారంభమవుతుందని, ఈ నెల 22 నుంచి తొలి విడత అడ్మిషన్లు ప్రారంభించి జూన్ 1తో ముగిస్తారని తెలిపారు. జూన్ 10 నుంచి రెండో విడత అడ్మిషన్లు ప్రారంభించి జూలై 1వతేదీ నాటికి అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పారు. అన్ని కళాశాలలు అడ్మిషన్ల వివరాలను సంబంధిత పోర్టల్ ద్వారా ఇంటర్‌బోర్డుకు అందజేయాలని ఆదేశించారు.

రిజర్వేషన్లు ఇలా..

అడ్మిషన్లలో కచ్చితంగా రిజర్వేషన్లు పాటించాలని ఆర్ఐవో తెలిపారు. మంజూరుకు మించి ఏ కళాశాల కూడా ప్రవేశాలు చేపట్టకూడదని, మొత్తం సీట్లలో 3వవంతు సీట్లను బాలికలకు కేటాయించాలని ఆర్ఐవో సూచించారు. ప్రైవేట్ కళాశాలల్లో ప్రతి సెక్షన్‌కు 88 మందికి మించి అడ్మిషన్లు చేయకూడదని, వీటిలో ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 6శాతం, బీసీలకు 25శాతం, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు 3శాతం, ఎన్‌సీసీ, ఆటలు, ప్రణాళికేతర అంశాలకు 4శాతం సీట్లు కేటాయించాలన్నారు. ఎక్స్‌సర్వీస్‌మెన్, రక్షణ సిబ్బంది పిల్లలకు 3శాతం, ఓపెన్‌లో 25శాతం సీట్లు కేటాయించాలన్నారు. ఇంటర్‌నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న మార్కుల జాబితా ఆధారంగా విద్యార్థులకు తాత్కాలికంగా ప్రవేశాలు కల్పించాలని, అనంతరం ఒరిజినల్ లేదా డిజిలాకర్ ద్వారా విడుదల చేసిన సర్టిఫికెట్లు, టీసీల ఆధారంగా ప్రవేశాలను నిర్ధారణ చేయాలని సూచించారు. జనరల్ గ్రూపులు, కోర్సులకు ప్రతి సెక్షన్‌కు 88 మందికి, ఒకేషనల్, పారామెడికల్ కోర్సుల్లో 30 మందికి, నాన్ పారామెడికల్ కోర్సుల్లో 40 మందికి గరిష్ఠంగా ప్రవేశాలు కల్పించాలని ఆదేశించారు.

కోర్సులు, ఫీజుల వివరాలు ప్రకటించాలి...

ప్రతి కళాశాలలో అందిస్తున్న కోర్సులు, చెల్లించాల్సిన ఫీజులు, కల్పిస్తున్న సదుపాయాలకు సంబంధించిన వాస్తవాలను డిస్‌ప్లే బోర్డుల ద్వారా తెలియ చేయాలని ఆర్ఐవో ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. ఏ కళాశాల కూడా అడ్మిషన్ల కోసం అవాస్తవాలను ప్రచారం చేయకూడదని, ర్యాంకులను ప్రకటించకూడదని స్పష్టం చేశారు. కొన్ని ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు చేసే అవాస్తవ ప్రకటనలకు తల్లిదండ్రులు మోసపోవద్దని కోరారు. జిల్లాలో అత్యధిక కళాశాలలకు అనుబంధ హాస్టల్ నిర్వహణకు అనుమతి లేదని, ఇంటర్ బోర్డు అనుమతులు లేకుండా, నిబంధనలు పాటించకుండా నడుస్తున్న కళాశాలల వివరాలు తెలుసుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పూర్తి సమాచారం, వివరాల కోసం ఫోన్ 0861-2320312 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఐదేళ్లుగా అభివృద్ధి చెందని చెరువు

- నిధులున్నా సాగని పనులు
- ప్రతిఏటా రైతుల అవస్థలు




తుప్పుపట్టి పనిచేయని షట్టర్లు

మనుబోలు, మే 14: వైసీపీ అధికారంలోకి వచ్చేసరికి మండలంలోని పలు చెరువుల అభివృద్ధికి జైకా నిధులు ఇచ్చేలా అనుమతులు వచ్చాయి. అయితే పనులు మాత్రం సాగలేదు. అంతకు మునుపు వ్యవసాయశాఖ మంత్రిగా పనిచేసిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెరువుల అభివృద్ధి కోసం జైకా నిధుల కోసం ప్రతిపాదనలు పంపారు. అందుకు అనుమతులు కూడా వచ్చాయి. ఈ క్రమంలో మనుబోలు చెరువును సుమారు రూ.2కోట్లతో అభివృద్ధి చేయాల్సి ఉంది. అనుమతులు వచ్చి ఐదేళ్లు గడిచినా చెరువును అభివృద్ధి చేయలేదు. ప్రతి ఏటా వర్షాకాలంలో నీళ్లు ఎక్కువైనప్పుడు, కట్టలు దెబ్బతింటున్న సమయాల్లో మనుబోలు రైతులు అవస్థలు పడుతూనే ఉన్నారు. చిన్నపాటి మరమ్మతులు చేయకపోగా ప్రతి పనీ జైకా నిధులతో చేసే సమయంలో చేస్తామని ఇంజనీరింగ్ అధికారులు చెబుతూవచ్చారు. తుప్పు పట్టి షట్టర్లు పనిచేయడం లేదు. చెరువుకు వచ్చిన నీటిని నిల్వ చేసుకోవడం, ఎక్కువైతే కిందకు వదిలిపెట్టలేక రైతులు తంటాలు పడుతున్నారు. చెరువు మధ్యభాగంలో అక్కడక్కడ ఉన్న తూములకైతే చెక్కలే లేకుండా పోయాయి. మరో పక్క చెరువు స్థలం రోజు రోజుకు కబ్జాలకు గురవుతోంది. దీనిపై పాలకులు, అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రతిఏటా ఎండాకాలంలో చెరువు బాగు చేస్తామని చెబుతూ వచ్చారు. తుఫాన్ల సమయంలో చెరువు నిండా నీరుచేరుకోవడంతో ఎక్కడ కట్టలు తెగిపోతాయన్న ఆందోళనలో రైతులు ఉండేవారు. చెరువు పనులు చేయకపోవడం కాంట్రాక్టర్ తప్పిదమా... చేయించకపోవడం అధికారుల ఉదాసీనతా... పట్టించుకోకపోవడం పాలకుల నిర్లక్ష్యమా... అవగతం కావడం లేదు. ఏమైనా మనుబోలు పెద్దచెరువు బాగుపడిన దాఖలాలులేవు.



మనుబోలు పెద్దచెరువు



నెల్లూరు(వ్యవసాయం), మే 14 : వైసీపీ ప్రభుత్వం వచ్చాక వ్యవసాయ మార్కెట్ కమిటీలు రైతుల సేవలకు దూరమయ్యాయి. సెస్ రూపంలో ఏటా రూ.కోట్లలో ఆదాయం వస్తున్నప్పటికీ రైతులకు గత ఐదేళ్లుగా రైతు బంధు పథకం కింద రుణాలు అందడం లేదు. అంతేకాకుండా వీటి ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వం ఇతర పనులకు మళ్లిస్తోంది. దీంతో అధిక ధర వచ్చే వరకు ధాన్యాన్ని గోదాముల్లో నిల్వ చేసుకుని రుణాలు పొందాలనే రైతులకు నిరాశే మిగులుతోంది. ఈ నేపథ్యంలో అప్పుల వారి వేధింపులు తట్టుకోలేక వచ్చిన ధరకు ధాన్యాన్ని తెగనమ్ముకుంటున్నారు. తమది రైతు ప్రభుత్వమంటూ వైసీపీ గొప్పలు చెప్పుకోవడం తప్ప రైతులకు చేసిందేమీ లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'రైతు బంధు'కి మంగళం!

● పథకమెంతో ఘనం

గత ప్రభుత్వ హయాంలో రైతు బంధు పథకం కింద మార్కెట్ యార్డు గోదాముల్లో పంట దిగుబడులు నిల్వ చేసుకునేవారు. ఆ విలువలో 75శాతం మేర రైతులకు రుణంగా అందేది. గరిష్ఠంగా రూ.2లక్షల వరకు ప్రభుత్వం ఇచ్చేది. ఎంతో మంది రైతులు రుణాలు తీసుకుని పెట్టుబడి ఖర్చులకు తీసుకొచ్చిన అప్పులు తీర్చేవారు. రైతు బంధు రుణాలపై సుమారు 180 రోజుల వరకు ఎలాంటి వడ్డీ భారం ఉండదు. రుణం పొందిన తర్వాత 181 రోజుల నుంచి 270 రోజుల వరకు 12శాతం వడ్డీ వసూలు చేస్తారు. అప్పటి వరకు దిగుబడులు అదే గోదాములో పెట్టుకోవచ్చు. ఒకసారి రైతుబంధు పథకం పత్రం పొందితే ఐదేళ్ల వరకు వినియోగించు కోవచ్చు. అయితే వైసీపీ ప్రభుత్వంలో ఈ పథకం నిలిచిపోవడంతో గోదాముల వైపు రైతు లు రాకపోవడం వల్ల అవి ఖాళీగా మారాయి. కొన్ని చోట్ల గోదాములు ప్రైవేటు వారికి అద్దెకు ఇస్తున్నారు.

● రూ.కోట్లలో ఆదాయం

జిల్లాలోని 8 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ఏటా రూ.కోట్లలో ఆదాయం వస్తోంది. ఏఎంసీ గోదాముల్లో రైతులు ధాన్యాన్ని నిల్వ చేస్తున్నా గత ఐదేళ్లుగా రుణాలు మంజూరు చేయడం లేదు. మార్కెట్ కమిటీ నిధులను రైతు సంక్షేమానికి ఖర్చు చేయడం మానేశారు. వచ్చే ఆదాయాన్ని ఇతర అభివృద్ధి పనులకు వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. ఆదాయంలో కనీసం 50శాతం అయినా రైతు బంధు పథకానికి కేటాయించాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధుల కేటాయింపులు లేకపోవడం వల్లే రైతులకు రుణాలు మంజూరు చేయడం లేదని పలువురు అధికారులు చెబుతున్నారు.


రుణాల ఊసే లేదు

జిల్లాలో 8 వ్యవసాయ మార్కెట్ కమిటీలు (ఏఎంసీ) ఉన్నాయి. నెల్లూరులో మూడు వేల మెట్రిక్ టన్నుల(ఎంటీఎస్) సామర్థ్యం కలిగిన ఐదు గోదాములున్నాయి. అదేవిధంగా కోవూరులో 8600 ఎంటీఎస్ సామర్థ్యం కలిగినవి 5, కావలిలో 22,900 ఎంటీఎస్ సామర్థ్యం కలిగిన 17, రాపూరులో వెయ్యి ఎంటీఎస్ సామర్థ్యం కలిగిన ఒకటి, ఆత్మకూరులో 3200 ఎంటీఎస్ సామర్థ్యం కలిగిన 4, ఉదయగిరిలో 5700 ఎంటీఎస్ సామర్థ్యం కలిగిన 6, సర్వేపల్లిలో 5050 ఎంటీఎస్ సామర్థ్యం కలిగిన 6, కందుకూరులో 8200 ఎంటీఎస్ సామర్థ్యం కలిగిన 6 గోదాములున్నాయి. మొత్తం 50 గోదాముల్లో దాదాపుగా 57,650 ఎంటీఎస్ దిగుబడులు నిల్వ చేసుకో వచ్చు. అయితే వీటిలో 11 మరమ్మతులకు గురయ్యాయి.

పందేల జోరు!

- రూ.లక్షల్లో బెట్టింగ్ కాస్తున్న అనుచరులు, అభిమానులు

'మా అభ్యర్థి 20 వేల మెజారిటీతో గెలుస్తాడని నాది రూ.లక్ష!'. అబ్బే... మీ అభ్యర్థి ఓడిపోతాడని నా పందెం రూ.2 లక్షలు!. కాదు.. కాదు.. స్వల్ప మెజారిటీతోనైనా మా అభ్యర్థి బయటపడతాడని నాది మూడింతల బెట్!. అంటూ నెల్లూరురూరల్ నియోజకవర్గంలో రాజకీయ పందేలు జోరందుకున్నాయి. సోమవారం పోలింగ్ ప్రక్రియ ముగియడంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపోటములపై వారి అనుచరులు, అభిమానులు భారీగా పందేలకు దిగారు. జూన్ 4వ తేదీ బహిర్గతం కానున్న ఫలితాల నాటికి ఈ పందేలు ఇప్పట్నుంచే నిర్వహిస్తున్నారు. మరోవైపు మధ్యవర్తులు పందెం రాయుళ్ల నుంచి భారీగా కమీషన్లు అర్జిస్తున్నారు.



నెల్లూరురూరల్, మే 14 : నెల్లూరురూరల్ నియోజకవర్గం నుంచి టీడీపీ, వైసీపీ అభ్యర్థులు రాజకీయ దిగ్గజాలు కావడంతో ఎవరు గెలుపు ఎటుంది అన్నది ఆసక్తికరంగా మారింది. హ్యాట్రిక్ కోసం ఈసారి టీడీపీ తరఫున బరిలో దిగిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఒకవైపు, ఎలాగైగా శ్రీధర్‌ను ఓడించాలని రూరల్‌తో తత్సంబంధాలున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డిని వైసీపీ రంగంలోకి దింపింది. దీంతో ఈ ఇద్దరి మధ్య నెలకొన్న పోటీ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ దశలో ఈ ఇద్దరిపై వారి అనుచరులు, అభిమానులు రూ. లక్షల్లో పందేలు కాస్తున్నారు. గెలుపోటములపై కొందరు, మెజారిటీపై మరికొందరు పందేలు కాసి రూ.లక్షల సొమ్ము చేతులు మారుస్తున్నారు. మరోవైపు పందేపురాయుళ్లకు మధ్యవర్తిత్వం చేస్తున్న వ్యక్తులు రూ.లక్షకు పది వేల వరకు కమీషన్లు తీసుకుంటున్నట్టు సమాచారం.

● ఆత్మకూరులోనూ పందేలు

ఆత్మకూరులో ఇరుపార్టీల నాయకులు అభ్యర్థులు గెలుపోటములపై రూ.లక్షల్లో పందేలు కాస్తున్నారు. టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి, వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి విజయం, మెజారిటీపై తమ అంచనాలకు తగ్గట్టుగా పందేలు కాస్తున్నారు మంగళవారం గ్రామస్థాయి నేతలతో ఆనం, మేకపాటిల కార్యాలయాలు కిటకిటలాడాయి. తమ తమ గ్రామాల్లో ఎంతెంత మెజారిటీ వస్తుందో లెక్కలతో సహా వివరించి అభ్యర్థుల మెప్పు పొందేందుకు నేతలు ప్రయత్నించారు.

సీబీఎస్ఈలో సత్తా చాటారు

- ఒకేసారి టెన్త్, ఇంటర్ ఫలితాల విడుదల
- పదిలో 98, ఇంటర్‌లో 96 శాతం ఉత్తీర్ణత



ప్రాప్తి జైన్



దియా మెహతా

నెల్లూరు (విద్య), మే 14 : సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) టెన్త్, ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. రెండు విభాగాల్లోనూ జిల్లా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. కలివెలపాళెం రెయిన్‌బో సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థిని ప్రాప్తి జైన్ 500కు 495 మార్కులతో జిల్లాలో అగ్రస్థానంలో నిలవగా, దియా మెహతా 484 మార్కులతో ద్వితీయస్థానం సాధించింది. నారాయణ గోమతి సీబీఎస్ఈ పాఠశాలకు చెందిన భావిక చిన్ని 483, శ్రీహాన్ 482, నిత్యానంద్ 480 మార్కులతో తర్వాతి స్థానాల్లో నిలిచారు. జిల్లా వ్యాప్తంగా రెయిన్‌బో, అక్షర, ఇతాకా, అవెన్యూస్, రత్నం, గోమతి, నారాయణ, ఆంబర్‌ఉడ్, కొత్తూరు కేంద్రీయ విద్యాలయం, ఇందుకూరుపేటలోని చిన్మయా మిషన్, కావలిలోని ఆర్ఎస్ఆర్‌తోపాటు మరో ఆరు కళాశాలల్లో సీబీఎస్ఈ విధానంలో బోధన సాగుతోంది. టెన్త్, ఇంటర్ విద్యార్థులకు ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి మార్చి వరకు వార్షిక పరీక్షలు నిర్వహించారు. టెన్త్‌కు 1,246 మంది, ఇంటర్‌కు 461 మంది కలిపి మొత్తం 2,707 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వీటి ఫలితాల్లో టెన్త్ విద్యార్థులు 98శాతం మంది, ఇంటర్ విద్యార్థులు 96 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు సంబంధిత విద్యా సంస్థల ప్రతినిధులు పేర్కొన్నారు.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే!

- విశ్లేషణలో నేతలు ● హోరెత్తిన బెట్టింగులు
- పెదవి విప్పని ఓటర్లు
- ఎలాంటి ఫలితాలు వస్తాయో అని ఉత్కంఠ



ట్రక్కులో నెల్లూరు తరలిస్తున్న ఈవీఎంలు

ఆత్మకూరు, మే 14: నియోజకవర్గంలో హోరాహోరీ ఎన్నికల పోరు నెలకొనడంతో గెలుపుపై ఎవరికి వారు ధీమాగా ఉన్నారు. పోలింగ్ సరళిని బట్టి తమ ప్రయత్నాలు ఎంత వరకు ఫలించాయో సమీకరణలు చేసుకోవడంతో తలమునకలవుతున్నారు. నియోజకవర్గంలోని ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట, సంగం, చేజర్ల, మర్రిపాడు మండలాల్లో ఓటరు నిర్ణయమేదైనా వర్గాలను కూడకట్టుకుని తాను శాసించగల ఓటర్లను తమ దోవలోకి తెచ్చుకోవడంలో ఎంతవరకు తాము సఫలమయ్యామో లెక్కలు వేసుకుంటున్నారు. ఎలాంటి ఫలితాలు అందిస్తాయనే విషయమై ప్రధాన పార్టీ అభ్యర్థులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ప్రధానపార్టీ నాయకులు గెలుపుధీమా వ్యక్తం చేస్తున్నారు. ఓటరు అంతుపట్టని విధంగా వ్యవహరించటంతో నాయకులు తమపార్టీ అభ్యర్థికే మెజార్టీ వస్తుందని లెక్కలు వేస్తూ సంతృప్తి చెందుతున్నారు. కార్యకర్తలు గ్రామస్థాయిలో ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు పడి ఉంటాయో లెక్కలు కడుతూ తమ నేతకు ఎంత మెజార్టీ వస్తుందనే విషయాన్ని అంచనా వేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

గెలుపుపై టీడీపీ ధీమా

ఆత్మకూరులో తెలుగుదేశం అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి విజయం తథ్యమని ఆ పార్టీ శ్రేణులు ధీమాగా ఉన్నారు. మండలాల వారీగా... గ్రామాల వారీగా... తమకు వచ్చే ఆధిక్యతను లెక్కకట్టి 10వేల పైబడి ఓట్ల ఆధిక్యతతో విజయం సాధిస్తామని విశ్లేషిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత, టీడీపీ సూపర్ సిక్స్, ఉమ్మడి మెనిఫెస్టో తమకు అనుకూలిస్తాయని టీడీపీ నాయకులు ధీమాగా ఉన్నారు. చేజర్ల, సంగం, ఆత్మకూరు మండలాల్లో ఆధిక్యత వచ్చే పరిస్థితి ఉందని వారు లెక్కలు వేస్తున్నారు. ఇక వైసీపీ అభ్యర్థి మేకపాటి సొంత మండలం మర్రిపాడు మండలంలో ఎప్పుడు లేని విధంగా ఎదురుగాలి తోలింది. అనూహ్యంగా టీడీపీకి సానుకూల పవనాలు వీచాయని విశ్లేషకులు అంచనాలు వేస్తున్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీ, ఏఎస్‌పేట మండలంలో టీడీపీకి స్వల్ప మెజార్టీ లభించే అవకాశాలున్నాయని పార్టీ నేతలు గ్రామాల వారీగా లెక్కలు చెబుతున్నారు. వైసీపీకి కంచుకోటగా ఉన్న అనంతసాగరం, మర్రిపాడు మండలాల్లో టీడీపీ పుంజుకోవడంతో వైసీపీ ఆధిక్యతకు గండిపడిందని చెబుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో టీడీపీ వారు విజయం తమదేనని ధీమాగా చెబుతున్నారు. వైసీపీ నేతలు సైతం గెలుపు తమదేననే ధీమాను వ్యక్తపరుస్తూ లెక్కలు కట్టే పనిలో పడ్డారు. వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి సైతం గెలుపుపై ధీమాగా ఉన్నారు. అనంతసాగరం, మర్రిపాడు మండలాల్లో, ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధి, ఏఎస్‌పేట, సంగం మండలాలతో పాటు ఆత్మకూరు రూరల్‌లో సైతం తమకు స్వల్ప ఆధిక్యత వస్తుందని చెబుతున్నారు.

ఈవీఎంల్లో భవిత

ఉదయగిరి: పోలింగ్ ముగియడంతో అభ్యర్థుల ఓటర్ల తీర్పు ఈవీఎంలో భద్రంగా నిక్షిప్తమైంది. వారి భవితవ్యం జూన్ 4వ తేదీన తేలనుంది. సోమవారం అర్ధరాత్రి పోలింగ్ ముగియగానే ఈవీఎంలకు సీల్ వేసి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య ఉదయగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం లోని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచారు. మంగళవారం ఉదయం ఇక్కడ నుంచి నెల్లూరులోని ప్రియదర్శిని కళాశాలకు తరలించారు. లెక్కింపు తర్వాత ఎవరు ఓడేది, ఎవరూ గెలిచేది తెలిపోతోంది.

ఎక్కడ చూసినా అదే ముచ్చట!

నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారు.. ఏ వర్గం ఓట్లు ఎవరికి అనుకూలంగా పడ్డాయి.. ఇదీ ఇప్పుడు జరుగుతున్న ప్రధాన చర్చ. అదే ముచ్చట్లు. ఊరువాడల్లో ఎక్కడ ఇద్దరు గుమిగూడినా ఏ నాయకుడిని పలకరించినా ఎవరు గెలుస్తారనే చర్చ విపరీతంగా సాగుతోంది. ఫోన్‌లో సన్నిహి తులు, ఇతర కార్యకర్తలను పలకరిస్తూ గెలుపోటములపై అందరూ ఆరా తీయడం కనిపిస్తోంది. మరోవైపు ఆయా పార్టీల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు ఈ అంచనాల్లో మునిగి తేలుతున్నారు. నియోజకవర్గంలో పరిధిలోని ఉదయగిరి, సీతారామపురం, వరికుంటపాడు, దుత్తలూరు, కొండాపురం, కలిగిరి, వింజమూరు, జలదంకి మండలాల్లో ఓటింగ్‌శాతం ఆధారంగా లెక్కలేస్తున్నారు. ఓవైపు పైకి గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నా.. ఓట్ల తీరును బట్టి ఏ పార్టీకి ఓట్లు పడ్డాయో అంచనాలతో ఓట్లను లెక్కిస్తున్నారు. కూడికలు, తీసివేతలతో గెలుపు అంతరాన్ని నిర్వహిస్తున్నారు. మరోవైపు టీవీల్లో వచ్చిన ఎగ్జిట్‌పోల్స్ కొంతమందిలో ఆశలు నింపగా, మరికొందరు అభ్యర్థుల్లో నిరాశకు గురిచేస్తున్నాయి. పోలింగ్‌శాతం అనుకున్నంతగా పెరగడంతో ఎవరికి ఇబ్బంది కలిగిస్తుందనే విషయంపై రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. అధికార వైసీపీ, ప్రతిపక్ష పార్టీ టీడీపీ అన్ని స్థానాలు మా వేనని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఓటింగ్‌శాతాన్ని బట్టి తమ అభ్యర్థికి బలం చేకూరుతుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

సోమశిలలో 7.842 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, మే 14: సోమశిల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు. మంగళవారానికి జలాశయంలో 7.842 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు అధికారు లు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలు వకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

నేటినుంచి సీతారాముల ఉత్సవాలు

ఉదయగిరి రూరల్, మే 14: శకునాలపల్లిలో బుధవారం నుంచి శుక్రవారం వరకు సీతారాముల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం గణపతిపూజ, పుణ్యాహవచనం, నవగ్రహపూజ, గురువారం విశేష అభిషేకా లు, పూజలు, స్వామివార్ల కల్యాణం, శుక్రవారం వసంతోత్సవం, పారువేట ఉంటుందన్నారు. ఉత్సవాల సందర్భం గా అన్నదానంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు పాల్గొనాలని కోరారు.

నిస్వార్థంగా పనిచేశారు..!



సీతారామపురం: మాట్లాడుతున్న భోగినేని కాశిరావు

సీతారామపురం, మే 14: మండలంలో మూడు, నాలుగు నెలల నుంచి కాకర్ల సురేష్ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గెలుపు కోసం నిస్వార్థంగా కూటమి నాయకులంతా పని చేయడం శుభపరిణామం అని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ భోగినేని కాశిరావు అన్నారు. మంగళవారం స్థానిక జనసేన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పేద, మధ్య తరగతి ప్రజలు కూటమి వైపు నిలబడి ఆశీర్వదించారని, మండలంలో జరిగిన ఓటింగే నిదర్శనం అన్నారు.

మరమ్మతుకు నోచుకోని చేతిపంపు



అనంతసాగరం: గుడిగుంట బస్‌షెల్టర్‌లో మరమ్మతులకు నోచని చేతిపంపు

అనంతసాగరం, మే 14: గుడిగుంట బస్‌సెల్టర్ సమీపంలోని చేతిపంపు భూ మట్టానికి చేరి వినియోగంలో లేదని దాన్ని పైకి లేపి పంపునకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. ఎండతీవ్రత అధికంగా ఉన్న ప్రస్తుత పరిస్థితిలో ఈ పంపు వినియోగంలోకి తెస్తే ప్రయాణికులు, మూగజీవాలకు తాగునీటి సమస్య తీర్చవచ్చని చెబుతున్నారు.

గృహోపకరణాల దగ్ధం

ఉదయగిరి రూరల్, మే 14: ఉదయగిరి ప్రాంతంలో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో పట్టణంలోని బాలాజీనగర్, దిలావర్ భాయ్‌వీధి, సుద్ధబావివీధి, నాగులబావివీధి, చాకలవీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పలు నివాసాల్లో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. వాటిలో ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, టీవీలు ఉన్నాయి.

తాటిముంజలకు భలే గిరాకీ

- డజను రూ.60 చొప్పున అమ్మకాలు

ఉదయగిరి, మే 14: స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో వింజమూరు, ఊటుకూరు, తక్కెళ్లపాడు గ్రామాల నుంచి కొందరు ప్రతిరోజూ తాటిముంజలు గంపల్లో తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. డజను ముంజలు రూ.60లు చొప్పున, ఒక్కొక్కటి రూ.5ల చొప్పున రూ.10కి రెండు ఇస్తున్నారు. ఖర్చులుపోను తమకు సుమారు రూ.800లు కూలిపడుతుందని వారు చెబుతున్నారు. వేసవి కావడంతో అనేక మంది కొనుగోలు చేస్తున్నారని, వ్యాపారం బాగుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వేసవి వచ్చిందంటే తాటి ముంజలకు గిరాకీ ఉంటుందని, అనేక ఔషధ గుణాలున్న వీటితో ఎండవేడిమి తాపం తగ్గుతుందని చెబుతున్నారు.

ఆత్మకూరు మినహా అన్ని మండలాల్లో 80శాతం పోలింగ్

- నియోజకవర్గంలో పోలింగ్ శాతం 83.49
- ఆధిపత్య గ్రామాల్లో అధికంగా ఓటింగ్



సంగంలో ఓటింగ్‌కు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

ఆత్మకూరు, మే 14: నియోజకవర్గంలోని టీడీపీ, వైసీపీ ఆధిపత్య గ్రామాల్లో భారీ ఎత్తున పోలింగ్ జరిగింది. తమకు అనుకూలంగా ఓటింగ్ చేసు కోవడంలో ఇరువర్గాల నాయ కులు విజయవంతం అయ్యారు. ఆధిపత్య గ్రామాల్లో జరిగిన భారీ పోలింగ్ ఫలితాలను తారుమారు చేస్తుందన్న అను మానం లేకపోలేదు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆత్మకూరు నియోజకవర్గంలో 83.49 శాతం పోలింగ్ జరిగింది. కొన్నిగ్రామాల్లో 90శాతం పైబడి పోలింగ్ జరిగి ఉండటం విశేషం. 2,15,401 మంది ఓటర్లలో 1,79,829 మంది ఓటర్లు తమహక్కును వినియోగించుకున్నారు. అందులో 1,05,815 మంది పురుషుల్లో 88,854 మంది ఓటు వేశారు. అదేక్రమంలో 1,09,578మంది మహిళల్లో 90,974మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. చేజర్ల మండలంలో అత్యధికంగా 88.47శాతం పోలింగ్ నమోదు కాగా ఆత్మకూరు మండలంలో అతితక్కువగా 80.96 శాతం పోలింగ్ నమోదైంది. మర్రి పాడు మండలంలో 81.78శాతం పోలింగ్ నమోదు కాగా సంగం మండలంలో 84.33శాతం, ఏఎస్‌పేట మండలంలో 84.56శాతం, అనంత సాగరం మండలంలో 83.35శాతం పోలింగ్ నమోదు కావడం గమనార్హం. ఆత్మకూరు మండలం మినహా మిగిలిన అన్నిమండలాల్లో 80శాతం పైబడి పోలింగ్ నమోదవడం నియోజకవర్గ చరిత్రలో రికార్డు సృష్టించి నట్లయ్యింది.

సంగం మండలంలో 84 శాతం పోలింగ్

సంగం: మండలంలో 84.33శాతం పోలింగ్ జరిగింది. మొత్తం ఓటర్లు 35,824 మంది ఉన్నారు. ఇందులో 30,210 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వారిలో పురుషులు 14803 మంది, మహిళలు 15407 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషుల కంటే 604 మంది మహిళలు హక్కు వినియోగించుకున్నారు. తలుపూరుపాడులో 821 మంది ఓటర్లకు గాను 760మంది ఓటుహక్కును వినియోగించుకుని 93.54 శాతంతో ప్రథమ స్థానంలో ఉండగా, రెండో స్థానంలో జంగాలకండ్రికలో 561 ఓట్లకు గాను 520 మంది ఓటు హక్కు వినియోగించుకుని ద్వితీయ స్థానంలో నిలిచారు. సంగం టౌన్‌లో మాత్రం 77.6 శాతంతో మండలంలో అత్యల్పంగా పోలింగ్ నమోదయ్యింది. పోలింగ్ సరళిని బట్టి ఇరుపార్టీలు ఎవరికి వారు తమకే మెజార్టీ వస్తుందని అంచనా వేసి ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ నాయకులు మండలంలో తమకు 3వేల పైచిలుకు ఓట్లు మెజార్టీ వస్తుంది, అదేవిధంగా వైసీపీ నేతలు లేదు.. మాకే 3వేల ఓట్ల మెజార్టీ రావడం ఖాయమని చెబుతున్నారు. అయితే ఓటర్లు ఇచ్చిన తీర్పు ఈవీఎంలో భద్రంగా ఉంది. ప్రజలు ఏ పార్టీ పట్ల మొగ్గు చూపారో, ఏ నాయకున్ని ఆదరిస్తారో తెలుసుకోవాలంటే జూన్ 4వ తేదీ వరకు ఆగాల్సిందే.

78.7 శాతం పోలింగ్

వింజమూరు: మండలంలో మొత్తం ఓటర్లు 33,369 మందిలో 26,278మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 78.7శాతం పోలింగ్ అయినట్లు తహసీల్దారు కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

సీతారామపురం: మండలంలో 25 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరిగాయి. మొత్తం 19848 మంది ఓటర్లు ఉండగా 15290 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 77.03 శాతంగా ఓట్లు నమోదయ్యాయి.

మారని మందుబాబుల తీరు..

ఉదయగిరి రూరల్, మే 14: పోలింగ్ ముగిసినా మద్యం షాపుల వద్ద మద్యం కోసం మందుబాబులు క్యూ కడుతూనే ఉన్నారు. ఎన్నికలకు ముందు ఈసీ మద్యం అమ్మకాల్లో ఆంక్షలు విధించింది. అప్పట్లో షాపులకు కేటాయించిన లక్ష్యం మధ్యాహ్నానికే పూర్తవుతుండడంతో షాపులు మూతపడ్డాయి. పోలింగ్ సందర్భంగా ఈ నెల 11న ఉదయం 7గంటల నుంచి 13వ తేదీ 7గంటల వరకు ప్రభుత్వం మద్యం షాపులను సీజ్ చేశారు. మంగళవారం మద్యం షాపులు తలుపులు తెరుచుకోవడంతో గతంలో మాదిరిగానే షాపుల వద్ద మందు కోసం బారులుతీరారు. మరోవైపు షాపులకు పక్కనే కూల్‌డ్రింక్స్ దుకాణాలు అందుబాటులో ఉండడం, అక్కడే సిట్టింగ్ వేసి మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. ఇదంతా సంబంధిత అధికారులకు తెలిసినా మామూళ్ల మత్తులో జోగుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కలువాయి: మందేసి మూడు రోజులైందని మంగళవారం ఉదయం తెరుచుకున్న మద్యం షాపుల ముందు మందుబాబులు బారులుతీరారు. స్వార్వత్రిక ఎన్నికల పోలింగ్ దృష్ట్యా శనివారం నుంచి మద్యం షాపులు మూసివేశారు. అప్పటి నుంచి మద్యం దొరక్క అల్లాడిపోతు న్నారు. ఓట్ల కోసం డబ్బు పంపిణీ చేసి ఉండటంతో జేబు లు నిండా డబ్బు ఉన్నా..మందు లేక వారి అవస్థలు వర్ణాతీ తం. బెల్టు దుకాణాల్లో ఉన్న మద్యం రూ.200ల బాటిలు రూ.500లు అమ్ముకున్నారని వాపోతున్నారు. ఎంత ధర అయినా కానీ మందు దొరక్క అల్లాడిపోయారు. షాపులు మళ్లీ తెర చుకోవడంతో బారులు తీరారు.



ఉదయగిరి: మద్యం కోసం ఎగబడుతున్న మందుబాబులు

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి



మానస థియేటర్ ఎదురుగా వ్యర్థాలతో నిండిన వరవ కాలువ

- అపరిశుభ్రతతో కావలి వాసుల కష్టాలు
- దోపిడీపై ఉన్న శ్రద్ధ ప్రజారోగ్యంపై కరువు
- ఐదేళ్లలో ఐదుగురు మున్సిపల్ కమిషనర్ల బదిలీ
- కుంటుపడ్డ పట్టణాభివృద్ధి

మురికి కూపంగా కనకపట్నం!

కావలిటౌన్, మే 14: కావలి కనకపట్నంగా మారుతుందని బ్రహ్మంగారి కాలజ్ఞానంలో చెప్పిన మాటేమోగాని పాలకులు మురికి కూపంగా మార్చారు. పట్టణంలో ఏ వీధి చూసినా.. ఏ కూడలి చూసినా చెత్తాచెదారాలు, వ్యర్థాలు కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తోన్నాయి. మురుగు కాలువలు, అందులో సంచరించే పందులతో అపరిశుభ్రత నెలకొంది. ముఖ్యంగా పట్టణ నడిబొడ్డునున్న వరువ కాలువలో చెత్తా చెదారాలు, కోళ్ల, చేపల వ్యర్థాలు, కుక్కలు, కోళ్ల కళేబరాలు వేస్తుండడం, అందులో పందులు గుంపులు గుంపులుగా సంచరిస్తుండడంతో భరించలేని దుర్గంధంతో ప్రజలు సహజీవనం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు, పాలకులకు దోపిడీపై ఉన్న శ్రద్ధ పరిశుభ్రతపై లేకపోవడంతో పట్టణ పరిశుభ్రత చిన్నాభిన్నంగా మారింది. పట్టణ పరిశుభ్రత పర్యావరణ పరిరక్షణ ప్రజారోగ్యంపై పర్యవేక్షించాల్సిన ప్రజాప్రతినిధులు, పాలకులు అధికారులనే పావులుగా వాడుకుని దోపిడీలో భాగస్వాములను చేసి తలాపాపం తిలాపిడెకుడుగా వాటాలు పంచుకుంటు సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఇది లా ఉండగా కారణాలు ఏమైనా కావచ్చుకాని ఐదేళ్ల పాలనలో ఐదుగురు మున్సిపల్ కమిషనర్‌లు మారారు.



పాతూరు రత్నం పాఠశాల ఎదురు రోడ్డులో చెత్తలో సేద తీరుతున్న పందులు

● మున్సిపల్ పరిధిలో ప్రతిరోజు వీధులు, మురుగు కాలువలు శుభ్రం చేయడం, దోమలు లార్వా చేరకుండా దోమల మందు పిచకారి చేయ డం, బ్లీచింగ్ చల్లడం, నీటి ట్యాంకర్ల శుద్ధి తదితర చర్యలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ అ వేవీ చేయకపోవడంతో పట్టణమంతా అపరిశుభ్ర వాతావరణం నెలకొని దోమలు, పందులకు మురుగు కాలువలు నిలయాలుగా మారాయి. దీం తో విష జ్వరాలు వ్యాపించడంతో ప్రజారోగ్యం ప్రమాదంలో పడి డెంగ్యూ లాంటి విషజ్వరంతో ప్రాణాలు పోగొట్టుకున్న ఘటనలు లేకపోలేదు..

పట్టణ పరిశుభ్రత, ప్రజా ఆరోగ్య పరిరక్షణకు మంజూరయ్యే కోట్ల రూపాయలు నిధులు దుర్వినియోగమై పక్కదారి పడుతున్నాయన్న ఆరోపణలున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో పర్మినెంట్, రోజువారి, కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. పర్మినెంట్ కార్మికుల్లో సగం మంది విధులకు హాజరు కాకుండా తమ స్థానంలో రోజువారి కూలీలను ఏర్పాటు చేసుకుని మున్సిపల్ అధికారులను మేనేజ్ చేసి ఇంట్లో కూర్చుని జీతాలు పుచ్చుకుంటున్నా రు. కాంట్రాక్ట్, రోజువారి కార్మికులతో మున్సిపల్ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధుల ఇళ్లలో పనులు చేయించుకుని ప్రభుత్వం జీతాలు ఇస్తోంది. ఒకరోజుకు 100 మంది రోజువారి కా

నిధుల దుర్వినియోగం

ర్మికులను పనిలో పెట్టుకుని 150మంది లెక్క చూపించి నిధులు కాజేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మున్సిపాలిటీ వారు ట్యాంకర్ల ద్వారా స్వచ్ఛనీరు సరఫరా చేయాల్సి ఉన్నా కలుషిత నీరు సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్న విమర్శలు లేకపోలేదు. రోజుకు తక్కువ ట్రిప్పులు నీరు సరఫరా చేసి ఎక్కువ ట్రిప్పులుగా దొంగ లెక్కలు రాసుకుని అధికారులు, అధికార పార్టీ నేతలు సొమ్ము చేసుకుం టూ ప్రభుత్వ నిధులు కాజేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో పట్టణంలో పారిశుధ్యం పడకేసింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై దృష్టి పెట్టని పాలకులు ఐదేళ్లల్లో ఐదుగురు మున్సిపల్ కమిషనర్లను మాత్రం మార్పించారన్న ఆరోపణలుసర్వత్రా వినిపిస్తున్నాయి.

కావలిలో 83.03 శాతం పోలింగ్

- గెలుపుపై ఎవరి ధీమా వారిదే..! ● కూడికలు, తీసివేతలతో నేతల బిజీ ● పార్టీ కార్యాలయాల వద్ద సందడి

కావలి, మే 14: కావలి నియోజకవర్గంలో 2,38,553 మందికి 1,98,066 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో పోలింగ్ 83.03 శాతం నమోదైంది. పోలింగ్ శాతం పెరగడంతో గెలుపుపై ప్రధానపార్టీలు ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఓటర్లు ఇద్దరి దగ్గర డబ్బులు తీసుకుని తమ అభిప్రాయం బయట పెట్టకుండా ఎవరడిగినా మనకే కదా అని చెప్పుతుండటంతో ప్రధానపార్టీలలో గెలుపుపై మరింత ధీమా పెరుగుతోంది. ఇదిలా ఉంటే కావలిలో బలమైన ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన పసుపులేటి సుధాకర్, బీసీ, ఎస్సీ, ఎస్టీ ఓట్లను కొంత చీల్చుతారనే ప్రచారం ఉంది. ఆయన చీల్చిన ఓట్ల వలన ఎవరికి నష్టం జరుగుతుందోనని ప్రధాన పార్టీలలో ఉత్కంఠ నెలకొంది. అయినా పోలింగ్ అనంతరం టీడీపీ నాయకులకు గెలుపుపై మరింత ధీమా పెరగగా వైసీపీ నాయకులలో కూడా గెలుపుపై నమ్మకం సన్నగిల్లలేదు. దీంతో రెండు పార్టీల ముఖ్యనాయకులు వారి అనుచరులతో సమావేశమై పట్టణాలు, మండలాలు, వార్డులు, గ్రామాలు ఇంకా బూత్‌ల వారీగా లెక్కలు వేసుకుంటున్నారు. కావలి పట్టణంలో మంచి మెజార్టీ వస్తోందని టీడీపీ అంచనా వేస్తుండగా టీడీపీ కన్నా ఒక్క ఓటైనా తమకే మెజార్టీ వస్తోందని వైసీపీ చెపుతోంది. మండలాల వారీగా కావలి రూల్ దగదర్తి మండలాల్లో టీడీపీ భారీ మెజార్టీ వస్తుందని అంచనా వేస్తుండగా అంత మెజార్టీ రాదని వైసీపీ నేతలు అంటున్నారు. బోగోలు మండలంలో మెజార్టీపై ఇరు పార్టీలు మాకంటే మాంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ నేత, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంఎల్ఏ కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డిలది అల్లూరు మండలం కావడంతో ఆ మండలంపై వైసీపీ నేతలు కొండంత ఆశలు పెట్టుకుని భారీ మెజార్టీ వస్తుందని అంచనా వేస్తున్నారు. కానీ టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రలది కూడా అల్లూరు మండలం కావడం, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి అల్లూరు అల్లుడు కావడంతో వారు కూడా అక్కడ మెజార్టీ వస్తుందని ధీమాగా ఉన్నారు. దీంతో నియోజకవర్గంలో రకరకాల సమీకరణలతో లెక్కలు వేసుకుంటూ గెలుపుపై మాత్రం ఎవరికి వారు ధీమాగా ఉన్నారు.

జలదంకిలో...

జలదంకి : మండలంలో 37,377 ఓట్లు ఉండగా 32,755 ఓట్లు పోలవడంతో 87.63 శాతం నమోదైంది. గతం కంటే ఎక్కువ శాతం నమోదు కావడంతో ఎన్డీఏ కూటమిదే పైచేయి అంటున్నారు. 2019లో కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, ప్రస్తుత కావలి కూటమి టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డిలు వైసీపీకి పనిచేయడంతో పాటుగా అప్పటి టీడీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత తోడై 8500 పైచిలుకు ఓట్ల భారీ మెజార్టీ సాధించింది. ప్రస్తుత జరిగిన ఎన్నికల్లో వంటేరు, కావ్యతో పాటుగా వైసీపీ మాజీ మండల కన్వీనర్ చేవూరి జనార్దన్‌రెడ్డిలు వైసీపీని వీడి టీడీపీ కూటమికి మద్దతివ్వడం, ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు, కూటమిలో భాగస్వాములైన జనసేన, బీజేపీల బలం తోడై వైసీపీ వెనుకంజలో ఉందని విశ్లేషకులు అంటున్నారు.

గెలుపుపై ధీమా!

- కూడికలు, తీసివేతల్లో నేతల నిమగ్నం
- గతం కంటే 0.55 శాతం తగ్గిన పోలింగ్

కందుకూరు, మే 14: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగిసి అభ్యర్థుల భవిష్యత్తు ఈవీఎంలలో నిక్షిప్తం కావటంతో గెలుపోటములపై అభ్యర్థులు అంచనాలలో తలమునకలవుతున్నారు. ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ అభ్యర్థుల కార్యాలయాల వద్ద పోలింగ్ ఏజెంట్లు, గ్రామ, వార్డు స్థాయి నాయకులతో మంగళవారం సందడి నెలకొంది. కందుకూరు నియోజకవర్గంలో నువ్వా నేనా అన్నట్లుగా పోటీ జరగటంతో గెలుపుపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ ఓటింగ్ సరళి, ప్రభుత్వ వ్యతిరేకత, యువత, మహిళలు అత్యధికంగా ఓటుహక్కు వినియోగించుకోవటం తదితర పరిణామాలు తమకు అనుకూలమని టీడీపీ శ్రేణులు అంచనా వేస్తున్నారు. అయితే ఇరుపార్టీల వారు కనీసం 1.5 నుంచి 2 శాతం ఓట్ల ఆధిక్యంతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే ఇప్పుడు 0.55 శాతం ఓటింగ్ తగ్గింది. అప్పట్లో మొత్తం 2,18,859 మంది ఓటర్లు ఉండగా 1,95,916 ఓట్లు పోలై 89.51 శాతం నమోదుకాగా ప్రస్తుతం 2,28,913 మంది ఓటర్లు ఉండగా 2,03,637 ఓట్లు పోలై 88.96 శాతం నమోదైంది. గత ఎన్నికల కన్నా స్వల్పంగా పోలింగ్ శాతం తగ్గినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటర్ల బలాబలాలకు సంబంధించి వలేటివారిపాలెం, లింగసముద్రం, కందుకూరు మండలాలు టీడీపీకి అనుకూలం అని అంచనా వేస్తుండగా ఈ మూడు మండలాల్లో పోలింగ్ శాతం గణనీయంగా పెరిగింది. ఇక వైసీపీకి అనుకూలంగా ఉంటుందని భావిస్తున్న ఉలవపాడు మండలం, కందుకూరు పట్టణంలో పోలింగ్ శాతం బాగా తగ్గటం తమకు కలిసొచ్చే అంశమని టీడీపీ శ్రేణులు అంచనా వేస్తున్నారు. ఈ అంచనాలకు తోడు పోలింగ్ బూత్ వారీ తమతమ పోలింగ్ ఏజెంట్లు నుంచి మెజారిటీ అంచనాలు తెప్పించుకుని కూడికలు, తీసివేతలు వేసుకున్న ఇరుపార్టీల నాయకులు ఎవరి అంచనాలు వారు చెబుతూ గెలుపు మాదంటే మాదేనని ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

టీడీపీ విజయం తథ్యం

- నియోజకవర్గ ప్రజలకు ఇంటూరి ధన్యవాదాలు

కందుకూరు, మే 14: కందుకూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ విజయం తథ్యమని, ప్రజలు ఎన్డీఏ కూటమికి మద్దతుగా ఓటు వేశారని కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండుటెండను కూడా లెక్కచేయకుండా ఓపికగా క్యూలైన్లలో వేచిఉండి పెద్దసంఖ్యలో ఓటుహక్కును వినియోగించుకున్న ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో అరాచకం పోవాలి చంద్రబాబు రావాలి అన్న కసితో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నట్లు పోలింగ్ సరళిని బట్టి స్పష్టంగా అర్థమైందని పేర్కొన్నారు. కందుకూరులో నాపై నమ్మకంతో ఎన్డీఏ కూటమికి అధిక శాతం ఓటు వేశారని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ విజయం వైపు అడుగులు వేసేలా ముందుకు నడిపించిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధవర్గాల ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో మీ అందరినీ వ్యక్తిగతంగా కలుసుకుని ముందడుగు వేస్తానని నాగేశ్వరరావు పేర్కొన్నారు.

రెండు మోటారు సైకిళ్ల ఢీ : యువకుడి మృతి

- మరో ఇద్దరికి తీవ్రగాయాలు



మృతి చెందిన వేణుగోపాల్

లింగసముద్రం, మే 14 : మండలంలోని పెంట్రాల సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఆర్ అండ్‌బీ రోడ్డుపై రెండు మోటారు సైకిళ్ల ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం రాత్రి 7 గంటలకు జరిగింది. ఎస్సై ఎం బాజీబాబు కథనం మేరకు.. మొగిలిచెర్ల గ్రామానికి చెందిన నాగినేని వేణుగోపాల్ (21), అదే గ్రామానికి చెందిన పడిదపు మౌళిలు మొగిలిచెర్ల నుంచి లింగసముద్రంకు మోటారు సైకిల్‌పై వస్తున్నారు. ఇదే సమయంలో కొండాపురం మండలం కొమ్మి గ్రామానికి చెందిన వర్ల హరికృష్ణ తాతాహోటల్ మీదుగా మొగిలిచెర్ల వైపు మోటారు సైకిల్‌పై వెళుతున్నాడు. ఈ క్రమంలో హరికృష్ణ వేగంగా వెళుతూ సబ్‌స్టేషన్ వద్ద నాగినేని వేణుగోపాల్ మోటారు సైకిల్‌ను ఢీకొట్టాడు. ఈ సంఘటనలో మోటారు సైకిల్‌పై ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108కి సమాచారమిచ్చారు. 108 ఇబ్బంది క్షతగాత్రులను చికిత్స నిమిత్తం లింగసముద్రం పీహెచ్‌సీకి తరలించారు. అయితే అప్పటికే వేణుగోపాల్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అలాగే మౌళిని ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కందుకూరుకు తరలించారు. హరికృష్ణకు స్థానిక పీహెచ్‌సీలోనే ప్రథమ చికిత్స చేశారు. విషయం తెలిసిన ఎస్సై బాజీబాబు పీహెచ్‌సీకి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, వేణుగోపాల్ మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

కావలి ఈవీఎంలు నెల్లూరుకు తరలింపు



ఎస్కార్ట్ బందోబస్తుతో ఈవీఎంలతో నెల్లూరుకు బయలుదేరిన కంటైనర్లు

కావలి రూరల్, మే 14: ఎన్నికల నియమావళి ప్రకారం జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఆదేశాలతో కావలి నియోజకవర్గంలోని ఈవీఎంలను మంగళవారం కంటైనర్ లారీలలో నెల్లూరులోని కనపర్తిపాడులో ఉన్న ప్రియదర్శిని కళాశాలకు తరలించారు. కావలి పట్టణ విట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణ నుంచి రెండు కంటైనర్ లల్లో ఎస్కార్ట్ భద్రత, నిఘా నేత్రాల నడుమ నెల్లూరు తరలించి స్ట్రాంగ్ రూంల్లో భద్రపరిచారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, మే 14: పట్టణంలోని విప్పగుంట రోడ్డులో రోశయ్య షామిల్లు ప్రాంతంలో లైన్‌వర్క్ ఉన్నందున బుధవారం ఉదయం 6:30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ టీవీ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని బలిజపాలెం, రూరల్ పోలీస్ స్టేషన్ ఏరియా, కనిగిరి రోడ్డు, నాంచారమ్మ కాలనీ, సబ్ కోర్టు ఏరియా, కోవూరు రోడ్డు, సాయినగర్, ఐఎస్ రావు నగర్, విజయనగర్ కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని పేర్కొన్నారు.

నగర పంచాయతీలో పారిశుధ్య లోపం !

● ఎక్కడ చూసినా మురుగుమయమే.. ● వ్యాధుల భయంతో ప్రజలు ● పట్టించుకోని అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం,మే14: బుచ్చి.. పేరుకే నగర పంచాయతీ. ఎక్కడ చూసినా మురుగుమయమే. దీంతో ఓ వైపు పందుల స్వైరవిహారం, మరో వైపు దుర్గంధ వాతావరణం. ఏడాదిలో రెండుసార్లు పన్నుల రూపంలో వేలాది రూపాయలు వసూలు చేస్తున్న అధికారులు పారిశుధ్యం పనులను విస్మరించారు. అంతేకాక నగర వాసులకు కనీస వసతులు కల్పించడంలో కూడా విఫలమయ్యారు.

బుచ్చినగరంలోని 5,6,7,8,9,10 వార్డుల పరిధిలోని కామాక్షికాలనీ, ఖాజానగర్, శాంతినగర్, కనిసిరిపాళెం వరకు, పాతగుడపల్లి కాలువలో దుర్గంధం వెదజల్లుతోంది. హౌస్‌తోటలో ఇరిగేషన్ బంగ్లా నుంచి చెన్నూరురోడ్డు వరకు, దిగువ ప్రాంతంలో కొత్త గుడపల్లి కాలువలోనూ ఇదే పరిస్థితి. పాతగుడపల్లి కాలువకు సైడ్ వాల్స్ పేరుతో కొంతమేరకు నిర్మించి గాలికొదిలేశారు. దీంతో మురుగునీరు పోయే దారిలేక, చెత్త చెదారాలు, ప్లాస్టిక్ కవర్లు, సీసాలు, ఇతర వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో పరిసరాల్లో కాపురాలుండే ప్రజలకు రాత్రింబవళ్లు తేడా లేకుండా దోమల బెడదతో అల్లాడిపోతున్నారు. దీంతో వారు వ్యాధుల భయంతో వణికిపోతున్నారు. నగర పంచాయతీ అధికారులు సత్వరం చర్యలు చేపట్టి పారిశుధ్యం పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


శాంతినగర్‌లోని పాతగుడపల్లి కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

పట్టించుకునే వారేరీ ?



కాలువలో మురుగు ఎటూ పోయే అవకాశంలేదు.ఏళ్ల తరబడి దుర్గంధం పీల్చి వ్యాధులకు గురవుతున్నాం. చెడువాసనతో చిన్నారులు వాంతులు కూడా చేసుకుంటున్నారు. అయినా అధికారులు కన్నెత్తి చూడడం లేదు.

- కామాక్షమ్మ, శాంతినగర్, బుచ్చి

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లకు టెండర్లు


సీల్డ్ టెండర్లు నిర్వహిస్తున్న ఆలయ అధికారులు, పాల్గొన్న టెండరుదారులు

బుచ్చిరెడ్డిపాళెం,మే14: జొన్నవాడలో ఈనెల 28 నుంచి నిర్వహించనున్న కామాక్షితాయి వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లకు సంబంధించి మంగళవారం ఆలయ కార్యాలయంలో ఈవో వీ గిరికృష్ణ సమక్షంలో సీల్డ్ టెండర్లు నిర్వహించారు. డ్రామాస్టేజీ, క్లాత్ పందిరి ఏర్పాటుకు రూ.64,999తో బాలాజీసింగ్, బ్యారికేడ్ల ఏర్పాటుకు రూ.13,800తో ఎస్.నవీన్, ప్రాకార మండపం చుట్టూ క్లాత్‌పందిరి ఏర్పాటుకు ఒక్కో బిట్టుకు రూ.288తో వినాయక లైటింగ్ నిర్వాహకులు, షామియానాలు, వంటపాత్రలు, ఫైరర్స్ సరఫరాకు రూ.18499తో కె.మల్లికార్జున, విద్యుద్దీపాలంకరణకు రూ.2,74,500తో వినాయక హైలైట్స్ అండ్ లైటింగ్ నిర్వాహకులు, ఫొటోలు, వీడియోల కవరేజ్‌కు రూ.70,000తో డీ హరిప్రసాద్ వేసిన సీల్డ్ టెండర్లలో తక్కువ ధరకు కోడ్ చేసి దక్కించుకున్నట్లు ఈవో తెలిపారు. రంగులు, సున్నం వేయుట, ఫ్లెక్సీల ఏర్పాటుకు టెండర్లు వాయిదా పడినట్లు ఆయన తెలిపారు.

కూటమి అభ్యర్థుల విజయం తథ్యం : వెంపటి


స్వామివారిని దర్శించుకుని బయటకు వస్తున్న మాధవనాయుడు

రాపూరు(డక్కిలి), మే 14 : రాష్ట్రంలో పెరిగిన ఓటింగ్ శాతం కూటమికే అనుకూలిస్తుందని, ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు 160 స్థానాల్లో విజయం సాధిస్తారని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవనాయుడు తెలిపారు. మంగళవారం ఆయన పెంచలకోనలో లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకొన్నారు. అనంతరం రాపూరులో మీడియాతో మాట్లాడారు. ఎప్పుడూ లేనివిధంగా ఓటర్లు కసితో వచ్చి ఓట్లు వేశారని చెప్పారు. ఇందంతా ప్రభుత్వ వ్యతిరేక ఓటని చెప్పారు. ఓటమి భయంతో వైసీపీ నేతలు దాడులకు తెగిస్తున్నారనని ఆరోపించారు.

కూటమిలో ఉత్సాహం

పొదలకూరు, మే 14: పోలింగ్ శాతం పెంచేందుకు టీడీపీ శ్రేణులు రెట్టించిన ఉత్సాహంతో పనిచేశారు. పోలింగ్ సరళి, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్న తీరు, యువత, రైతులు ఓటింగ్‌లో పాల్గొనడం చూస్తుంటే టీడీపీ, జనసేన, బీజేపీలో ఉత్సాహం ఉరకలేస్తున్నదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కూటమి శ్రేణులు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. జూన్ 4 వరకు ఉత్కంఠ కొనసాగనున్నప్పటికీ.. ముందే వారిలో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. టీడీపీ కార్యాలయాలు, నేతల నివాసాల్లో కార్యకర్తల రాకపోకలతో సందడిగా మారాయి.

అత్యధిక మెజారిటీతో వీపీఆర్ దంపతుల విజయం


విజయకుమార్

కోవూరు, మే14: సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంటు స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కోవూరు నుంచి బరిలో నిలిచిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అత్యధిక మెజార్టీతో విజయం సాధించనున్నారని జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకుడు దాసరి విజయకుమార్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని గమళ్ళపాలెంలో మంగళవారం బీసీ సంక్షేమ సంఘం, గౌడ సంఘం సంయుక్తంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని వెనుకబడిన తరగతులకు చెందిన ఓటర్లంతా టీడీపీకే ఓటేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధివిధానాల్ని నిరసిస్తూ ఓటర్లు చెప్పిన తీర్పు బ్యాలెట్‌బాక్సుల్లో నిక్షిప్తమై ఉందన్నారు. కోవూరు నియోజకవర్గంలో వైసీపీ నాయకుల అరాచకాలకు విసుగుచెందిన పేదలంతా టీడీపీ అభ్యర్థులకు పట్టం కట్టారన్నారు. సమావేశంలో నాయకులు నిమ్మల శ్రీనివాసులు, యేనేటి నిరంజన్, గౌతమ్, నిమ్మల సాయి, ఉయ్యూరు నాగరాజు తదితరులు మాట్లాడారు.

వీపీఆర్ దంపతుల గెలుపు ఖాయం

విడవలూరు, మే 14: జరిగిన ఎన్నికల్లో చంద్రబాబు సీఎం కావడం ఖాయమని, అలాగే వేమిరెడ్డి దంపతులు భారీ మెజారిటీతో విజయం సాధిస్తారని టీడీపీ మండలాధ్యక్షుడు చెముకుల శ్రీనివాసులు తెలిపారు. విడవలూరులోని పార్టీ కార్యాలయంలో మంగళవారం అయన విలేకరులతో మాట్లాడారు. కోవూరులో ప్రశాంతిరెడ్డి విజయానికి ప్రతి కార్యకర్త, నాయకుడు కూడా కష్టపడి పని చేశారని ఆయన పేర్కొన్నారు. విడవలూరు మండలంలో టీడీపీకి సుమారు నాలుగువేల ఆధిక్యం వస్తుందని తెలిపారు. జూన్ 4న తరువాత వైసీపీ రాష్ట్రంలో కనిపించదని అన్నారు.

వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి విజయం ఖాయం


శ్రీనివాసులురెడ్డి

కొడవలూరు మే14 : కోవూరు టీడీపీ కూటమి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గెలుపు తథ్యమని టీడీపీ సీనియర్ నాయకుడు బెజవాడ శ్రీనివాసులురెడ్డి అన్నారు. మండలంలో మిక్కిలింపేటలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అరాచకపాలనను అంతమొందించాలనే లక్ష్యంతో పెద్ద ఎత్తున యువత, మహిళలు మార్పు కోరుతూ ఆమెకు పట్టం కట్టారన్నారు. వీపీఆర్ దంపతులు రాజకీయాలకు అతీతంగా నిరుపేదలకు ఉచితంగా కార్పొరేటు వైద్యం అందించి ఆదుకుంటున్నారన్నారు. జిల్లాలో తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి ఆదుకున్నారన్నారు. వారి చేసిన సేవా కార్యక్రమాలే వారిని భారీ మెజారిటీతో గెలిపించబోతున్నాయని పేర్కొన్నారు. వేమిరెడ్డి దంపతులు ప్రజలకు సేవా చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చారన్నారు. వారు కూటమి అభ్యర్థులుగా రావడం ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. నేడు రాష్ట్ర ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని, రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. పేదలు, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే టీడీపీ తోనే సాధ్యమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 స్థానాల్లో టీడీపీ విజయం సాధించబోతున్నదని చెప్పారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ పికెట్ ఏర్పాటు

మనుబోలు, మే 14: మండలంలోని కొమ్మలపూడిలో మంగళవారం పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఎన్నికల నే పథ్యంలో సోమవారం గ్రామంలో ఇరుపార్టీల నాయకుల మధ్య ఉద్రిక్తత నెలకొంది. పోలింగ్ బూత్‌ల వద్ద టీడీపీ, వైసీపీ నాయకులు దాడులు చేసుకున్నారు. ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారని ఎస్‌ఐ అజయ్‌కుమార్ తెలిపారు. దీంతో గ్రామంలో మూడు రోజుల పాటు పికెట్ ఏర్పాటుచేసి సమస్యను సర్దుబాటు చేస్తామని తెలిపారు.

ప్రశాంతంగా పోలింగ్

● ఎస్పీ మార్పుతో పోలీసు శాఖకు మచ్చ

● ఎస్‌బీ ఎస్‌ఐ సరెండర్‌పై చర్చ

నెల్లూరు(క్రైం), మే 14: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జిల్లాలో ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అయినప్పటి నుంచి జిల్లాలో అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే ఎన్నికలు జరుగుతాయని, అందుకు పోలీసు యంత్రాంగం సహకరిస్తుందంటూ ప్రతిపక్షాలు ఆరోపణలు చేశాయి. అయితే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ఏప్రిల్ నెలలో కేంద్ర ఎన్నికల కమిషన్ జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డిని బదిలీ చేసింది. దీంతో జిల్లా పోలీసు శాఖపై చెరగని మచ్చ పడింది. అనంతరం జిల్లాపై ఎలాంటి పట్టులేని కే ఆరీఫ్ హాఫీజ్ జిల్లా పోలీసు బాస్‌గా నియమించింది. ఆయన ఏప్రిల్ 4న బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నిర్వహణలో పూర్వానుభవనం లేకపోయినప్పటికీ చాలెంజ్‌గా విధులు నిర్వహిస్తూ అందరినీ కలుపుకుని ప్రత్యేక ప్రణాళికతో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించారు. చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, నిరంతరం తనిఖీలు చేస్తూ, ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగారు. పోలింగ్ మరో ఐదు రోజులు ఉందనగా ఎస్పీ రాత్రి వేళ తనిఖీలు ముమ్మరం చేశారు. ప్రతి నియోజకవర్గానికి ఒక డీఎస్పీ స్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించి, సమస్యాత్మక కేంద్రాల్లో బీఎస్‌ఎఫ్ సిబ్బందిని బందోబస్తు ఉండేలా చర్యలు తీసుకున్నారు. పోలింగ్ కేంద్రాలు అధికంగా ఉండటం, సిబ్బంది తక్కువగా ఉన్నప్పటికీ ప్రతి పోలింగ్ కేంద్రంలో పోలీసు సిబ్బంది ఉండేలా చర్యలు చేపట్టారు. జిల్లాలోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో చిన్నపాటి వివాదాలు మినహాయిస్తే ప్రంశాతంగా ఓటింగ్ ప్రక్రియ సాగింది. దీంతో జిల్లా పోలీసులతో పాటు పోలీసు బాసు ఊపిరి పీల్చుకున్నారు. ఇక, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఏళ్ల తరబడి సర్వేపల్లి నియోజకవర్గంలో ఎస్‌ఐగా విధులు నిర్వహించిన శివకృష్ణారెడ్డి ఎన్నికల నిబంధనల్లో భాగంగా వీఆర్‌కు వెళ్లారు. అక్కడి నుంచి ఎస్‌బీ ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించి అనేక ఆరోపణలు ఎదుర్కొన్న ఆయన్ను హెడ్‌ఆఫీసుకు సరెండర్ చేయడం జిల్లాలో పెద్ద చర్చగా మారింది.

రెండు మోటారు సైకిళ్ల ఢీ : యువకుడి మృతి

● మరో ఇద్దరికి తీవ్రగాయాలు

లింగసముద్రం, మే 14 : మండలంలోని పెంట్రాల సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుపై రెండు మో టారు సైకిళ్ల ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం రాత్రి 7 గంటలకు జరిగింది. ఎస్సై ఎం బాజీబాబు కథనం మేరకు.. మొగిలిచెర్ల గ్రామానికి చెందిన నాగినేని వేణుగోపాల్ (21), అదే గ్రామానికి చెందిన పడిదపు మౌళిలు మొగిలిచెర్ల నుంచి లింగసముద్రంకు మోటారు సైకిల్‌పై వస్తున్నారు. ఇదే సమయంలో కొండాపురం మండలం కొమ్మి గ్రామానికి చెందిన వర్ల హరికృష్ణ తాతాహోటల్ మీదుగా మొగిలిచెర్ల వైపు మోటారు సైకిల్‌పై వెళుతున్నాడు. ఈ క్రమంలో హరికృష్ణ వేగంగా వెళుతూ సబ్‌స్టేషన్ వద్ద నాగినేని వేణుగోపాల్ మోటారు సైకిల్‌ను ఢీకొట్టాడు. ఈ సంఘటనలో మోటారు సైకిల్‌పై ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108కి సమాచారమిచ్చారు. 108 ఇబ్బంది క్షతగాత్రులను చికిత్స నిమిత్తం లింగసముద్రం పీహెచ్‌సీకి తరలించారు. అయితే అప్పటికే వేణుగోపాల్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అలాగే మౌళిని ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కందుకూరుకు తరలించారు. హరికృష్ణకు స్థానిక పీహెచ్‌సీలోనే ప్రథమ చికిత్స చేశారు. విషయం తెలిసిన ఎస్సై బాజీబాబు పీహెచ్‌సీకి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, వేణుగోపాల్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

ప్రమాదకరంగా వాలిన విద్యుత్ స్తంభాలు

సైదాపురం, మే 14: మండల పరిధిలోని తుమ్మలతలుపూరు గ్రామం చావతిప్ప గిరిజన కాలనీ వద్ద ఉన్న జగనన్న లేఅవుట్‌లో విద్యుత్ స్తంభాలు వాలి ఉన్నాయి. ఆ గృహాలు పునాదుల దశలోనే ఉన్నాయి. విద్యుత్ శాఖాధికారులు నామమాత్రంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. దేవరవేమూరు గ్రామం కండలేరు వాగు చప్టా వద్ద విద్యుత్ స్తంభం కూడా వాలి ఉంది. మండలంలో విద్యుత్ తీగల ప్రమాదంతో పలువురు ప్రాణాలు కోల్పోయారు. గత ఏడాది మొలకలపూండ్ల గ్రామంలో వ్యవసాయ భూమిలో విద్యుత్ తీగలు కింద తెగిపడిపోవడంతో ఓ రైతు పొలంలోనే మృతి చెందాడు. సైదాపురం దళితవాడలో నివాస గృహాలపై విద్యుత్ తీగలు యమపాశాలుగా ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖాధికారులు వాలి పోయి ఉన్న స్తంభాలను సరి చేసేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


చావ తిప్ప గిరిజన కాలనీ వద్ద జగనన్న లేఅవుట్‌లో వాలిన విద్యుత్ స్తంభాలు


దేవరవేమూరు చప్టా వద్ద వాలిన విద్యుత్ స్తంభం



జీతాలెప్పుడు సారూ?!

● అబ్కాస్ ఉద్యోగుల ఆవేదన

● వైద్య కళాశాల, జీజీహెచ్‌లో విధులు

● 15 నెలలుగా వేతనాల్లేవు

● 5 నెలల నుంచి మంత్రి కాకాణి వద్దే ఫైలు !

● కుటుంబ పోషణకు అప్పుల భారం

● వచ్చే కొత్త ప్రభుత్వంపైనే ఆశలు

నెల్లూరు(వైద్యం), మే 14 : నెల్లూరు నగరంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల (జీజీహెచ్), ప్రభుత్వ వైద్యకళాశాలలో అబ్కాస్ పథకం కింద పనిచేసే చిరుద్యోగులు ఆకలి కేకలు పెడుతున్నారు. ఏడాదికిపైగా వేతనాలు అందక పోవడంతో ఆర్థికంగా అవస్థలుపడుతూ కుటుంబ పోషణకు అప్పులపాలవుతున్నారు. వీరు వేతనాల చెల్లింపులో రాష్ట్ర మంత్రులు కర్కశంగా వ్యవహరించిన తీరు ఆ ఉద్యోగుల కుటుంబాలలో కన్నీళ్లు నింపుతోంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అంబటి రాంబాబుతోపాటు వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్దన్ రెడ్డి ఉద్యోగుల వేతనాలకు సంబంధించిన ఫైల్‌ను నెలల కాలంగా తమ వద్దే ఉంచుకున్నారేగానీ పరిష్కరించడం మాత్రం లేదనే ఆరోపణలున్నాయి. ఎన్నికల కోడ్ రాక ముందు ఉద్యోగ సంఘాల నేతలు అబ్కాస్ ఉద్యోగుల వేతనాలపై ప్రశ్నిస్తే ఇన్‌చార్జి మంత్రి 'మీకింకా వేతనాలు రాలేదా అయితే మంత్రిగా ఉన్న కాకాణిని కలవండి' అని పదేపదే చెప్పార న్నారు.

అయితే 5 నెలల నుంచి ఉద్యోగుల ఫైల్ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వద్దే ఉంది. వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబుతో మాట్లాడి ఫైల్‌పై సంతకం చేస్తానని మంత్రి కాకాణి చెబుతున్నారేగానీ, ఇప్పటి వరకు సంతకం చేయకుండా కాలయాపన చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం జిల్లా మంత్రి ఈ ఫైల్‌పై సంతకం చేస్తే ఇన్‌చార్జి మంత్రి కూడా సంతకం చేస్తారు. అప్పుడు వీరికి వేతన బకాయిలను ప్రభుత్వం చెల్లిస్తుంది. అయితే, మంత్రి కాకాణి వద్దే ఫైల్ ఉంచుకుని ఉద్యోగుల జీవితాలలో అటలాడుతున్నారని వైద్య వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో రాబోయే ప్రభుత్వంలో అయినా తమ కష్టాలు తీరుతాయని ఉద్యోగులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

రూ.38.25 లక్షల బకాయి

ప్రభుత్వ వైద్య కళాశాల, జీజీహెచ్‌లో ఏడాదికిపైగా వీరు పని చేస్తున్నా వీరికి వేతనాలు మాత్రం అందటం లేదు. మాకు వేతన బకాయిలు చెల్లించండి మహాప్రభో! అంటూ అధికారులను వేడుకుంటున్నా ఫలితం ఉండటం లేదు. దీంతో వారి ఆర్థిక పరిస్థితి రోజురోజుకు దయనీయంగా మారుతోంది. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, వైద్య కళాశాలలో 17 మంది అబ్కాస్ ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరంతా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులే. గత ఏడాది ఫిబ్రవరి మాసంలో ఓటీ అసిస్టెంట్, ల్యాబ్ అసిస్టెంట్, జనరల్ డ్యూటీ అటెండర్లు, ప్లంబర్, మార్చురీ అటెండర్లుగా నియమితులయ్యారు. ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున వేతనాలు చెల్లించేలా ఒప్పందం కుదిరింది. అయితే 15 నెలలు పూర్తయినా వీరికి వేతన బకాయిలు మాత్రం చెల్లించలేదు. తమకు జీతాలివ్వాలని ఏడు నెలలుగా ఉద్యోగులు కోరుతున్నా వీరి వేదన అరణ్య రోదన అవుతోంది. రూ.38.25 లక్షల వరకు బకాయిలు ఉద్యోగులకు చెల్లించాల్సి ఉంది. వీటి కోసం ఎన్నో పోరాటాలు చేశారు. కలెక్టర్‌తోపాటు అధికారులను కలిశారు. అప్పటి ఇన్‌చార్జి మంత్రితోపాటు జిల్లా మంత్రిని పలు దఫాలు కలిసినా ప్రయోజనం లేకపోవటంతో రాబోయే ప్రభుత్వంపై ఆశలు పెట్టుకుని బతుకుతున్నారు.

మా గోడు పట్టించుకోండి



ఇప్పటికే 15 నెలలుగా వేతన బకాయిలు రాలేదు. ఈ పరిస్థితిలో అప్పు ఇచ్చే నాథుడే లేక పస్తులు ఉండాల్సిన వస్తోంది. వేతన బకాయిల కోసం ఇంకెంత కాలం ఎదురు చూడాలి?. కుటుంబ పోషణకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదు. ఎన్నికలు పూర్తయినందున ఉన్నతాధికారులైనా మా దీనస్థితిని అర్థం చేసుకుని బకాయిలు చెల్లించి ఆదుకోవాలి.

- పెంచల ప్రసాద్, కాంట్రాక్టు ఉద్యోగి

మంత్రుల చుట్టూ తిరిగాము... ఫలితం లేదు



అబ్కాస్ ఉద్యోగుల బకాయిల కోసం మం త్రుల చుట్టూ తిరిగాము. అయినా ఫలితం లేదు. జిల్లా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దగ్గరే ఫైల్ ఉంది. ప్రస్తుతం ఎన్నికల పూర్తయిన నేపథ్యం లో ఆ ఫైల్‌కు విలువలేదు. రాష్ట్ర అధికారులే చొరవ చూపాల్సి ఉంటుంది. వెంటనే వేతన బకాయిలు చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. దాదాపు 15 నెలల వేతన బకాయిలు ఉంటే ఆయా కుటుంబాలు ఎలా బ్రతకాలి.

- సందానీ బాషా, యునైటెడ్ హెల్త్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి

టెన్త్ సీబీఎస్ఈ ఫలితాల్లో 'రెయిన్‌బో' విజయభేరి


విద్యార్థులను అభినందిస్తున్న సిబ్బంది

నెల్లూరు (విద్య), మే 14 : సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో రెయిన్‌బో సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు విజయభేరి మోగించారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో విద్యాసంస్థ డైరెక్టర్ పద్మా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగానే ఈ ఏడాది కూడా తమ విద్యార్థులు జిల్లాలో అగ్రస్థానంలో నిలిచారన్నారు. పాఠశాలకు చెందిన ప్రాప్తి జైన్ 500 మార్కులకు 495 మార్కులతో అగ్ర స్థానంలో నిలవగా, దియా మోహతా 484 మార్కులతో ద్వితీయ స్థానం, కే రిషిక రెడ్డి 479 మార్కులతో తృతీయ స్థానం సాధించారని చెప్పారు. మొత్తం మీద 97 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 32 మంది 90శాతం మార్కులు సొంతం చేసుకున్నారని, వందశాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు మరిన్ని ఉత్తమ ఫలితాలు సొంతం చేసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ అనిగోవకుమార్, అరుణా స్వయంప్రభ, వైస్ ప్రిన్సిపాళ్లు సురేఖరెడ్డి, పద్మజ, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో 'నారాయణ గోమతి' ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న సిబ్బంది

నెల్లూరు (విద్య), మే 14 : సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో నారాయణ గోమతి విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో మంచి ఫలితాలు సాధించారని విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి తెలిపారు. నగరంలోని పాఠశాలలో మంగళవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ పాఠశాలకు చెందిన భావిక చిన్ని 483, శ్రీహాస్ 482, నిత్యానంద్ 480 మార్కులు సాధించా రన్నారు. మొత్తం 271 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 50 శాతం విద్యార్థులు 400 మార్కులకుపైగా సొంతం చేసుకున్నారని, వందశాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఇంటర్‌లో 73 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా ఎంపీసీలో 500 మార్కులకు గుమ్మడి నాగసాయిశ్రీ, షేక్ మల్లికా షఫరహా 460 మార్కులు సాధించారన్నారు. బైపీసీ విభాగంలో కోయగురు వెంకట సాత్విక్ 488 మార్కులు, యనమల బ్రాహ్మిణి, గొల్లపల్లి సాయిచేతన రెడ్డి 480 మార్కులు సాధించారని చెప్పారు. మొత్తం వందశాతం ఉత్తీర్ణత సాధించామని, 82శాతం విద్యార్థులు 400కుపైగా మార్కులు పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎంలు రవివర్మ, శ్రీనివాసులురెడ్డి, ప్రిన్సిపాల్ సుధీర్, డీన్ నారాయణరావు, కళాశాల ఏజీఎం మధురెడ్డి, కోర్ డీన్ జేకే రాయుడు, బైపీసీ డీన్ వర్ధిని, డీన్ కే శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ పుష్పలత, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'మెడికవర్'లో ఊపిరితిత్తులకు అరుదైన శస్త్రచికిత్స

● డాక్టర్ కౌశిక్‌రెడ్డి, డాక్టర్ రాజేష్‌రెడ్డి



మాట్లాడుతున్న వైద్య నిపుణులు డాక్టర్ కౌశిక్‌రెడ్డి

నెల్లూరు (వైద్యం), మే 14 : నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స జరిగింది. ఈ సందర్భంగా మంగళవారం మెడికవర్ పల్మనాలజిస్ట్ డాక్టర్ కాటంరెడ్డి కౌశిక్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లా డారు. నగరానికి చెందిన సుభాషిణి(26) అనే యువతి లంగ్ ఆఫ్సస్ హైడ్రోటిక్ సిస్ట్ అనే వ్యాధితో బాధపడుతోందని చెప్పారు. ఊపిరితిత్తుల నుంచి చీము కారడంతో ఆమె బాధపడేదని, బాధితురాలు జిల్లాలోని పలు ఆసుపత్రులకు వెళ్లగా చెన్నై, హైదరాబాద్‌కు తీసుకువెళ్లాలని చెప్పారని తెలియచేశారు. ఇటీవల మెడికవర్ ఆసుపత్రికి రావడంతో పూర్తిస్థాయి పరీక్షలు నిర్వహించి ఎంతో క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించామన్నారు. ప్రస్తుతం బాధితురాలు పూర్తిగా కోలుకుందని చెప్పారు. క్రిటికల్ కేర్ డాక్టర్ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రిలో ఉన్న అత్యాధునిక పరికరాల ద్వారా ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తిచేశామన్నారు. ఈ కార్యక్రమంలో బాధితురాలు సుభాషిణి, ఆమె తల్లి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి విశేష అలంకరణ

కనువిందు చేసిన వాసవీ అలంకరణ

నెల్లూరు (సాంస్కృతికం), మే 14 : నగరంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జన్మదిన వేడుకలు మంగళవారం 6వ రోజుకి చేరాయి. మంగళవారం అమ్మవారికి వాసవీమాత అలంకారం భక్తులకు కనువిందు చేసింది. అర్చకుడు శివకుమార్‌స్వామి ఆధ్వ ర్యంలో విశేష పూజలు, శ్రీలలితా సహస్ర నామ పారా యణం జరిగాయి. ఉభయదాతలు ముక్కాల ద్వారకానాథ్ కుటుంబం, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

కనుల పండువగా దత్తాత్రేయ అలంకారం

నెల్లూరు (సాంస్కృతికం), మే 14 : నగరంలోని మూలస్థానేశ్వరాలయంలో వసంతోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష పూజలు, అమ్మవారికి నిత్యపూజలు, విశేష పూలంగిసేవ జరిగాయి. గురుదత్తాత్రేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. దత్తాత్రేయ అలంకారం భక్తులకు కనువిందు చేసింది. ఈ ఉత్సవాలను ధర్మకర్తలు, ఉభయకర్తలు, ఈవో వేణుగోపాల్, సిబ్బంది పర్యవేక్షించారు.

ఏపీఆర్‌జేసీలో 'నేతాజీ' విద్యార్థులకు ర్యాంకులు

నెల్లూరు (విద్య), మే 14 : ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో నగరంలోని శ్రీనేతాజీ ఎంఎస్‌ఆర్ పైలట్ స్కూల్, కోచింగ్ సెంటర్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో ర్యాంకులు సాధించారని ఆ విద్యాసంస్థల చైర్మన్ ఎంవీ సుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్షల్లో ఎంపీసీ విభాగంలో రాష్ట్రస్థాయిలో తమ విద్యార్థులు షేక్ సాయికిరణ్ 79వ ర్యాంకు, కే నరసింహ చాణుక్య 358, యూ వెంకట దిలీప్ 607, బీ ఉమేష్‌చంద్ర 636వ ర్యాంకు సాధించారని చెప్పారు. బైసీపీలో పీ వికాస్ 802వ ర్యాంకు సాధించాడన్నారు. ఉత్తమ ర్యాంకులతో ఏపీ గురుకుల కళాశాలల్లో సీట్లు సాధించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైసీపీ బరితెగింపు



నానీపై హత్యాయత్నం సమాచారంతో మహిళా వర్సిటీ వద్దకు చేరుకున్న వందలాదిమంది టీడీపీ శ్రేణులు

- మహిళా వర్సిటీ ప్రాంగణంలో పులివర్తి నానీపై హత్యాయత్నం
- దాడులు, ప్రతిదాడులు... వాహనాల ధ్వంసం.. బైక్ దగ్ధం.. గాల్లోకి కాల్పులు... లాఠీఛార్జి... పలువురికి గాయాలు..
- స్ట్రాంగ్ రూములున్న వర్సిటీలో భద్రతా లోపం



మహిళా వర్సిటీ ఆవరణలో వైసీపీ కార్యకర్తల వీరవిహారం - సుత్తులు, బీర్ బాటిళ్లతో నానీ కారుపై దాడి-కారు దిగేసి వెళుతున్న నాని

తిరుపతి, మే 14 (ఆంధ్రజ్యోతి) : చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై జరిగిన దాడితో మంగళవారం తిరుపతి పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయ ప్రాంగణం రణరంగంగా మారింది. దాడులు, ప్రతిదాడులు, వాహనాల ధ్వంసం, బైక్ దగ్ధం, గాల్లోకి కాల్పులు, లాఠీఛార్జీలు వంటి ఘటనలతో ప్రశాంతతకు మారుపేరైన మహిళా వర్సిటీ ప్రాంతం అట్టుడికిపోయింది. వందలాది మంది వైసీపీ, టీడీపీ మద్దతుదార్ల దాడులు, ప్రతిదాడులతో గంటల పాటు వర్సిటీ ప్రాంగణం, పరిసరాల్లో ఉద్రిక్తతలు రాజ్యమేలాయి.

మధ్యాహ్నం 3.22 గంటలకు

మహిళా విశ్వవిద్యాలయంలోని స్ట్రాంగ్ రూముల నుంచీ వెనుదిరిగి వస్తున్న పులివర్తి నానీ వాహనాలపై వైసీపీ వర్గీయులు బీరు బాటిళ్ళు, కర్రలు, ఇనుప రాడ్లు, సుత్తులతో దాడి చేశారు. వాహనాలు ధ్వంసం చేశారు. నానీని గాయపరిచారు. గన్‌మ్యాన్ గాల్లోకి కాల్పులు జరిపినా వెనక్కు తగ్గకుండా దాడులకు తెగబడడంతో గన్‌మ్యాన్ ధరణి కూడా తీవ్రంగా గాయపడ్డారు.

3.35 గంటలకు: దాడి నుంచీ తేరుకున్న నానీ అనుచరులు ఆయన్ను తీసుకుని వర్సిటీ మెయిన్ గేటు దాటి వెలుపలికి వచ్చి రోడ్డుపై బైఠాయించారు. అరగంట పాటు ధర్నా నిర్వహించి నానీని స్విమ్స్‌కు తరలించారు.

సాయంత్రం 4.10 గంటలకు: పెద్ద సంఖ్యలో మహిళా వర్సిటీలోకి చేరుకున్న టీడీపీ శ్రేణులు రాళ్ళు, ఇనుప రాడ్లతో ప్రతిదాడికి దిగారు. వైసీపీ వర్గీయులకు చెందిన కారును ధ్వంసం చేశారు. ఆవరణలో ఆందోళనకు దిగారు.

4.30గంటలకు: అలిపిరి సీఐ రామచంద్రా రెడ్డి వాహనంలో లోపలికి రాగా వాహనాన్ని చుట్టుముట్టి పోలీసు వైఫల్యంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీఐ వాహనం దిగి దూరంగా వెళ్ళగా వాహనాన్ని ధ్వంసం చేశారు.

5గంటలకు: చంద్రగిరి నియోజకవర్గవ్యాప్తంగా భారీ సంఖ్యలో టీడీపీ మద్దతుదారులు వర్సిటీలోకి దూసుకొచ్చారు. పోలీసు తీరును నిరసిస్తూ వర్సిటీ ఎదుట ఆందోళనకు దిగారు.

5.15గంటలకు: ఇద్దరు ఏఎస్పీలు, డీఎస్పీలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. టీడీపీ వర్గీయుల ఆందోళన మరింత తీవ్రతరమైంది.

5.20గంటలకు: బీఎస్ఎఫ్ పోలీసులు రబ్బర్ బుల్లెట్లతో గాల్లోకి కాల్పులు జరిపారు. పోలీసులు లాఠీఛార్జి జరిపి చెదరగొట్టేందుకు యత్నించారు.

5.30 గంటలకు: వైసీపీ స్టిక్కర్ వున్న మొబైల్ చేతిలో పట్టుకుని బైక్‌పై వచ్చిన యువకుడిని ఆందోళనకారులు చితకబాది బైక్‌ను తగులబెట్టారు.

5.45 గంటలకు: మహిళా వర్సిటీ వద్దకు చేరుకున్న టియర్ గ్యాస్ వాహనాలు, కేంద్ర సాయుధ బలగాలు. వచ్చీ రాగానే లాఠీఛార్జి చేసి ఆందోళన కొనసాగిస్తున్న టీడీపీ వర్గీయులను చెదరగొట్టి తరిమివేశారు. లాఠీఛార్జిలో పది మంది గాయపడ్డారు. అందులో ఐదుగురు మీడియా ప్రతినిధులున్నారు.

6గంటలకు: ఘటనా స్థలానికి ఎస్పీ రాక. టీడీపీ అభ్యర్థి, అతడి గన్ మ్యాన్ క్షేమంగా వున్నారని, స్ట్రాంగ్ రూమ్ సైతం భద్రంగా వుందని మీడియాకు స్పష్టం చేశారు. అభ్యర్థిపై జరిగిన దాడిలో పాల్గొన్న నిందితులను గుర్తించామని, గంటలోగా అరెస్టు చేస్తామని వెల్లడించారు.

భీతావహంగా వర్సిటీ ప్రాంగణం

దట్టమైన అడవిని తలపించేలా పచ్చటి చెట్లతో, చల్లటి వాతావరణంతో ప్రశాంతతకు మారుపేరులా కనిపించే పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం ప్రాంగణం మంగళవారం చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై జరిగిన దాడితో ఉద్రిక్తతలకు నిలయంగా మారింది. దాడులు, ప్రతిదాడులు, అరుపులు, కేకలతో వర్సిటీ ఆవరణ, పరిసరాలు భీతావహంగా మారాయి. ఆవరణలో పగిలిన బీరు బాటిళ్ళు, రాళ్ళు, విరిగిపోయిన కర్రలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడివున్నాయి. నానీ వాహనాలు, వైసీపీ వర్గీయుల వాహనం, పోలీసు వాహనం ధ్వంసమయ్యాయి. నానీ వాహనాల్లో ప్రత్యర్థులు దాడి సందర్భంగా వదిలిపెట్టిన రాళ్ళు, ఉనుప సుత్తి వంటివి పడివున్నాయి. వందలాది మంది టీడీపీ వర్గీయులు పోలీసు వైఫల్యాన్ని ప్రశ్నిస్తూ తీవ్ర ఆగ్రహావేశాలతో ఊగిపోతూ కనిపించారు. ఇక వర్సిటీ వెనుకవైపు తుమ్మలగుంటలోనూ వెయ్యిమందికి పైగా వైసీపీ వర్గీయులు రాళ్ళు, కర్రలతో మొహరించడం మరింత్ర ఉద్రిక్తతకు కారణమైంది. ఆవరణ లోనూ, వెలుపలా మొహరించిన సివిల్ పోలీసులు, కేంద్ర బలగాలతో, లాఠీఛార్జీలతో మొత్తం మీద వర్సిటీ ప్రాంగణం, పరిసరాలు భీతావహంగా మారాయి.

పోలీసు వైఫల్యంతోనే టీడీపీ అభ్యర్థిపై దాడి

పులివర్తి నానీపై దాడి ఘటనలో పోలీసు వైఫల్యం స్పష్టంగా బయటపడింది. సోమవారం పోలింగ్ సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని బ్రాహ్మణ కాలవ, పులివర్తి వారిపల్లి, రామిరెడ్డిపల్లి, కూచువారిపల్లి గ్రామాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రామచంద్రాపురం మండలం బ్రాహ్మణ కాలవలో బీఎస్ఎఫ్ జవాన్ గాల్లోకి కాల్పులు జరిపే దాకా పరిస్థితి విషమించింది. టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ స్వగ్రామమైన పాకాల మండలం పులివర్తివారిపల్లిలో వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌ను టీడీపీ వర్గీయులు అడ్డుకున్నారు. చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లిలో టీడీపీ వర్గీయులపై దాడులు జరిగాయి. పక్కనే వున్న కూచువారిపల్లికి వెళ్ళిన చెవిరెడ్డి మోహిత్, అతని సోదరుడు హర్షిత్‌రెడ్డి, అనుచరులను టీడీపీ వర్గీయులు నిర్బంధించారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు అతికష్టమ్మీద వారిద్దరినీ గ్రామం నుంచీ బయటకు పంపగలిగినా వారి అనుచరులు ఇద్దరు గ్రామంలోనే చిక్కుకుపోయారు.వారిని గ్రామస్తులు నిర్బంధించి దాడి చేసినట్టు వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. అలాగే మోహిత్ అనుచరులకు చెందిన రెండు కార్లను తగులబెట్టారు. వైసీపీ సర్పంచ్ ఇంటిని సైతం తగులబెట్టారు. చెవిరెడ్డి స్వగ్రామమైన తుమ్మలగుంటలో టీడీపీ నేత దొడ్ల కరుణాకర్‌రెడ్డిపై దాడికి యత్నం జరిగింది. ఈ ఘటనల నేపథ్యంలో నియోజకవర్గవ్యాప్తంగా టీడీపీ, వైసీపీ వర్గాల నడుమ ఉద్రిక్తతలు పెరిగిపోయాయి. వీటి తీవ్రతను అంచనా వేయడంలో పోలీసులు దారుణంగా తప్పటడుగు వేశారు. వైసీపీ, టీడీపీ అభ్యర్థుల కదలికలను, ఎత్తుగడలను కూడా పోలీసు అధికారులు అంచనా వేయడంలో విఫలమయ్యారు. దాడులు, ప్రతిదాడులు జరిగే అవకాశముందన్న కనీస ఆలోచన గానీ, వాటిని అడ్డుకునే కనీస ప్రయత్నం గానీ చేయలేదు. అలాంటి ఆలోచన చేసివుంటే అభ్యర్థుల వెంట షాడో పార్టీలను నియమించి వుండేవారు. రెండు పార్టీల సామాజిక మాధ్యమాల మీద కన్నేసేవారు. వారి కదలికల సమాచారం షాడో పార్టీల ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకుని ఇలాంటి ఘటనలను నిలువరించే వీలుండేది. ఈ విషయంలో పోలీసులు దారుణంగా విఫలమైనట్టు కనిపిస్తోంది.



మహిళా వర్సిటీ ఆవరణలో ధ్వంసమైన వైసీపీ వాహనం - వైసీపీ దాడుల్లో దెబ్బతిన్న నానీ కార్లు- గాయపడ్డ నానీకి ఉపచారాలు

టీడీపీ శ్రేణులు వచ్చినంత వేగంగా పోలీసులు రాలేదు

మహిళా వర్సిటీ ఆవరణలో నానీపై దాడి జరగ్గా ఆయన సతీమణి సుధారెడ్డి సామాజిక మాధ్యమాల్లో అటు పోలీసులకు, ఇటు టీడీపీ శ్రేణులకు వెంటనే రావాలని పిలుపిచ్చారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఎక్కడెక్కడో వున్న టీడీపీ కార్యకర్తలు వందలమంది అరగంటలో మహిళా వర్సిటీకి చేరుకోగా పోలీసు బలగాలు మాత్రం సకాలంలో రాలేదు. దానివల్లే ఐదారు వందల మంది టీడీపీ మద్దతుదారులు వర్సిటీ ఆవరణలోకి ప్రవేశించి ప్రతి దాడులకు పాల్పడ్డారు. చివరికి పోలీసు వాహనం కూడా వారి దాడిలో ధ్వంసమైంది. దీనికి కూడా పోలీసు వైఫల్యమే కారణంగా కనిపిస్తోంది.



వైసీపీ దాడుల్లో గాయపడ్డ గన్‌మ్యాన్ ధరణి

స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత డొల్లతనం బట్టబయలు

మహిళా వర్సిటీ ఆవరణలోని ఇంజనీరింగ్ విభాగం గదుల్లో ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. అక్కడ మూడంచెల భద్రత కల్పించామని కలెక్టర్, ఎస్పీ స్వయంగా వెల్లడించారు. తొలి అంచెలో అంటే గదుల వద్ద సీఐఎస్ఎఫ్ బలగాలు, రెండవ అంచెలో అంటే భవనం వెలుపల సాయుధ బలగాలు, మూడవ అంచెలో సాధారణ పోలీసులు, హోమ్‌గార్డులు కాపలా వుంటారని చెప్పారు. ఎన్నికల అధికారులను, అభ్యర్థులను, వారి జనరల్ ఏజెంట్లను అది కూడా వారి ఐడీలను తనిఖీ చేశాకే లోనికి అనుమతించాల్సి వుండగా 150మందికి పైగా వైసీపీ కార్యకర్తలు వాహనాల్లో వర్సిటీ ఆవరణలోకి ఎలా రాగలిగారన్నది ప్రశ్న. అంతమంది యధేచ్ఛగా మారణాయుధాలతో లోనికి వచ్చి టీడీపీ అభ్యర్థి వాహనాలను ధ్వంసం చేసి అభ్యర్థిపైన, గన్‌మ్యాన్‌పైనా దాడి చేయడం కలకలం సృష్టించింది. ఇదే సాధ్యమైనప్పుడు స్ట్రాంగ్ రూముల్లోని ఈవీఎంలను పోలీసు యంత్రాంగం ఎంతవరకూ కాపాడగలదన్న ప్రశ్న తలెత్తుతోంది. మొత్తానికి స్ట్రాంగ్ రూములున్న వర్సిటీ ఆవరణలో భద్రత డొల్లతనాన్ని ఈ ఘటన బట్టబయలు చేసింది.

స్ట్రాంగ్ రూమ్ కాపలా పోలీసులు అడ్డుకోకుంటే నానీ పరిస్థితి ఏమయ్యేది?

మహిళా వర్సిటీ ఆవరణలోని ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల వద్ద కాపలా వున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోవడంతో నానీపై దాడికి పాల్పడిన వైసీపీ వర్గీయులు పరారయ్యారు. ఒకవేళ కాపలా పోలీసులు అక్కడికి సకాలంలో రాకపోయివుంటే నానీ, అతడి అనుచరుల పరిస్థితి ఏమై వుండేదన్న ప్రశ్న భయం గొలుపుతోంది. వైసీపీ వర్గీయులు రాళ్ళు కర్రలు, ఇనుప రాడ్లు, సుత్తులు వంటివి వెంట తెచ్చుకుని వాటితోనే దాడికి దిగిన తీరు వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తోంది. దాడిలో నానీకి జరగరానిది ఏదైనా జరిగివుంటే చంద్రగిరి, తిరుపతి, చిత్తూరు నియోజకవర్గాల్లో టీడీపీ శ్రేణులు మరింత రెచ్చిపోయి ప్రతీకార దాడులకు దిగివుండేవారు. అదే జరిగితే పరిణామాలు తీవ్రంగా వుండేవి.

నానీని చూడ్డానికి వెళ్తుండగా దాడి చేశారు

పాకాల, మే 14 :తిరుపతిలో పులివర్తి నానీపై దాడి జరిగిందని తెలిసి చూడ్డానికి వెళుతున్న తెలుగుదేశం మద్దతుదారులపై మంగళవారం సాయంత్రం పాకాల సమీపంలో వైసీపీకి చెందిన కొందరు దాడి చేశారు. బాధితుల కథనం మేరకు... ఐరాల మండలం పేరయ్యగారిపల్లెకు చెందిన తనూజ్, జ్యోతిష్, సోమశేఖర్, రాజశేఖర్, సాయిభరత్ కారులో తిరుపతికి వెళ్తుండగా పాలినేనిపల్లె సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జివద్ద వైసీపీకి చెందిన హరీష్, సద్దాం, నూర్‌నబీ, అబ్దుల్, కున్ని దాడిచేశారు. కారు అద్దాలు పగులగొట్టారు. బాధితుల ఫిర్యాదుతో ు పాకాల పోలీసులు విచారణ జరుపుతున్నారు.

నానీపై దాడికి నిరసనగా వైసీపీకి రాజీనామా

చంద్రగిరి, మే 14 : నానీపై వైసీపీ దాడిని నిరసిస్తూ వైసీపీ స్టేట్ ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి దామరపాటి గుణశేఖర్‌నాయుడు పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కష్టపడ్డానని, అయితే ఇటీవల జరుగుతున్న అరాచకాలు, దౌర్జన్యాలను చూశాక పార్టీలో వుండలేక పోతున్నానన్నారు.నానీపై వైసీపీ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.



టీడీపీ కార్యకర్తలపై లాఠీచార్జి

నాని, గన్‌మెన్ ధరణి క్షేమం

- వారిపై దాడులకు తెగబడిన వారిని తక్షణం అరెస్టు చేస్తాం
- ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

తిరుపతి(నేరవిభాగం), మే 14:పులివర్తి నానీపై మహిళా వర్సిటీ వద్ద దాడికి పాల్పడిన ఘటనలో అందరినీ గుర్తించి అరెస్టు చేస్తామని ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్ చెప్పారు.మహిళా విశ్వవిద్యాలయం వద్ద దాడి జరిగిన ప్రాంతాన్ని ఆయన పరిశీలించి పోలీసులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అంతకుముందు స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న నానీని పరామర్శించారు. రుయాలో చికిత్స పొందుతున్న గన్‌మ్యాన్ ధరణిని పరామర్శించారు.జరిగిన ఘటనపై ఇద్దరి వద్దా స్టేట్ మెంట్లు రికార్డు చేశారు. రాడ్లు,సుత్తులు, కర్రలు, బీరు బాటిళ్ళు, రాళ్ళతో జరిపిన దాడుల్లో నాని భుజానికి బలమైన గాయమైంది. అలాగే గన్‌మెన్‌కు కుడి కంటిపై గాయం కావడంతో చికిత్స నిమిత్తం రుయాలో చేరారు. అనంతరం ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ నాని, ఆయన గన్‌మెన్ క్షేమంగా వున్నారన్నారు. దాడికి పాల్పడిన వారిని వీలైనంత త్వరలో పట్టుకుంటామన్నారు.

దాడి కేసులో ప్రధాన నిందితులు గణపతి,ఖాను ?

పులివర్తి నానీ, ఆయన గన్‌మెన్ ధరణిపై జరిగిన దాడి ఘటనకు సంబంధించి సీసీ పుటేజీ, అక్కడున్న కారు ఎవరిది అనే వివరాలను పోలీసులు సేకరించినట్లు తెలిసింది.రామచంద్రాపురం జడ్పీటీసీ డిల్లీరాణి భర్త భానుకుమార్ రెడ్డి, నడవలూరు సర్పంచ్ గణపతి రెడ్డితో పాటు దాదాపు 50మంది దాకా దాడి ఘటనలో పాల్గొన్నట్లు సీఐ మురళీకృష్ణ గుర్తించారు. ఘటనా స్థలంలో వైసీపీ కండువాలను, ఇతర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.నిందితులను పట్టుకోవడానికి ఎస్పీ ప్రత్యేక బృందాలను నియమించారు.

టీడీపీకి ఓట్లు వేస్తారా అంటూ గర్భిణిపై దాడి

మాజీ వలంటీర్ తమ్ముడి నిర్వాకం



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు

పెళ్లకూరు, మే 14: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేస్తారా అంటూ ఓ గర్భిణిపై మాజీ వలం టీర్ మాలతి సోదరుడు తేజ దాడి చేశాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి ఆలస్యంగా వెలు గులోకి వచ్చింది. బాధితుల కథనం మేరకు... తమిళనాడుకు చెందిన వి.కృష్ణన్ కుటుంబం సహా మరికొన్ని పెళ్లకూరుమిట్టలో నివాసం ఉంటున్నాయి. కృష్ణన్ మనవరాలు వి.అరుణకు ఇక్క డ ఓటు ఉంది. ఈ క్రమంలో సోమవారం ఓటు వేసింది. సోమవారం సాయంత్రం మాజీ వలంటీర్ పెద్ద నాన్న కృష్ణయ్య... కృష్ణన్ ఇంటికి వచ్చి టీడీపీకి ఓటు వేశారా ప్ర శ్నించారు. తాము ఎవ్వరికి ఓటేశామో ఎందుకు చెప్పాలని ప్రశ్నించడంతో ఆయనపై దాడికి యత్నించారు. అక్కడే ఉన్న అరుణ అడ్డుకోవడంతో మాజీ వలంటీర్ సోదరుడు తేజ ఆమెను కాలితో తన్నాడు. దీంతో ఆమెను కుటుం బీకులు శ్రీకాళహస్తికి తీసుకువెళ్లి ప్రాథమిక చికిత్సల అనంతరం తిరుపతి మెటర్నటీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సల అనంనతం మంగళ వారం రాత్రి పోలీస్‌స్టేషన్ వచ్చి జరిగిన ఘటనపై ఫిర్యాదు చేశారు. పోలీ సులు కేసును దర్యాప్తు చేస్తున్నారు. బాధితురాలిని టీడీపీ మండల అధ్యక్షు డు నంచి కృష్ణయ్య, నాయకులు పేరం మధుసూదన్‌నాయుడు తదితరులు అరుణను పరామర్శించారు.

కార్యకర్తల జోలికొస్తే ఊరుకునే ప్రసక్తే లేదు

టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పాశిం సునీల్‌కుమార్

గూడూరు, మే 14: టీడీపీ కార్యకర్తల జోలికొస్తే ఊరుకునే ప్రసక్తే లేదని ఆ పార్టీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పా ర్టీ కార్యాలయంలో కూటమి నాయకులతో కలిసి సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టీడీపీ గెలుపు ఖాయమని తెలు సుకుని పోలింగ్ శాతాన్ని తగ్గించేందుకు తమ పార్టీ కార్యకర్తలపై వైసీపీ నా యకులు దాడులకు పాల్పడ్డారన్నారు. దుర్భాషలాడుతూ, పోలీసులను అడ్డు పెట్టుకుని దౌర్జన్యాలకు దిగారన్నారు. సోమవారం ఎన్నికల సమయంలో చిల్లకూరులో తమ కార్యకర్తలపై దాడి చేసిన ఎస్‌ఐ అంజిరెడ్డిపై ఎన్నికల కమిషన్, ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఓట మి భయంతోనే వైసీపీ నాయకులు టీడీపీ కార్యకర్తలపై దాడులకు దిగ డం, ఆస్తులకు నష్టం కలిగించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. గౌరవ ప్రదమైన ఎమ్మెల్సీ స్థానంలో ఉండే వైసీపీ అభ్యర్థి ఈ తరహా చర్యలను ప్రో త్సహించడం ఎంతవరకు సమంజసమన్నారు. చిల్లకూరు మండలం చింతవరంలో టీడీపీ కార్యకర్త గోపాల్‌పై దాడికి దిగడం, తిప్పగుంటపాళెంలో చిల్లకూరు మండల అధ్యక్షుడు ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి రొయ్యల గుంటల్లో విషప్రయోగం జరిపి నష్టం కల్పించడం మంచి పద్ధతి కాదన్నారు. ఇప్పటి వరకు గూడూరులో లేని ఈ తరహా సంస్కృతికి వైసీపీ నాయకులు తీసుకు రావడాన్ని ఖండిస్తున్నామన్నారు. నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, వెంకటేశ్వర్లురెడ్డి, కిశోర్‌నాయుడు, బాలకృష్ణమనాయుడు, ఇంద్రవర్ధన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా గెలిచేది నేనే: కురుగొండ్ల రామకృష్ణ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి/ డక్కిలి, మే 14:వెంకటగిరి ఎమ్మెల్యేగా గెలిచేది తానేనని, సీఎంగా కుర్చీలో కూర్చునేది చంద్రబాబేనని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి కురు గొండ్ల రామకృష్ణ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన నివా సంలోని పార్టీ చాంబర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్ సరళిని చూస్తేనే టీడీపీ విజయం తథ్యమని ప్రజలే చెబుతున్నారన్నారు. ఓటమి భయంతోనే వైసీపీ అల్లర్లకు తెగబడుతోందన్నారు. గత ఐదేళ్ల జగన్ రాక్షసపాలనను చూసిన ప్రజలు ముఖ్యంగా యువత ఇతర దేశాలు, రాష్ట్రాలనుంచి వచ్చి కసితో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. వెంకటగిరి మున్సిపాలిటీలో 10 వేల నుంచి 15 వేల మెజారిటీ, నియోజకవర్గంలోని 6 మండలాల్లో మరో 15 వేల నుంచి 20 వేల మెజారిటీ వస్తుందని మొత్తం 35 వేల మెజార్టీతో తాను గెలవడం ఖాయమన్నారు. బి.రాజేశ్వరావు, సి.సి.నాయుడు, వెంకటేశ్వర్లు నాయుడు, జి.శ్రీనివాసులు, గొల్లగుంట మురళీ, రమణయ్య, టి.రామచంద్ర య్య, నాగరాజు, జనసేన పార్టీ నాయకులు అనీల్, రాజేష్ పాల్గొన్నారు. చం ద్రగిరి టీడీపీ అభ్యర్థి నానిపై వైసీపీ రౌడీ మూకలు పథకం ప్రకారమే హ త్య చేయాలని చూశాయని కురుగొండ్ల రామకృష్ణ మండిపడ్డారు. మంగళ వారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ ఓటమి భయంతోనే వైసీపీ రౌడీ మూకలు టీడీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా దాడులకు దిగడం పిరికిపంద చర్యగా ఆయన అభివర్ణించారు.

టీడీపీని ఆదరించిన అందరికీ కృతజ్ఞతలు

● నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల



నాయుడుపేట, మే 14: టీడీపీని ఆదరించిన నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, ప్రజలకు, ఏజెంట్లకు మాజీ ఎంపీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో ప్రశాంత పోలింగ్‌కు సమ ర్థవంతంగా పనిచేసిన పోలీసులు, అధికార యంత్రాం గాన్ని అభినందించారు. ఎన్డీఏ కూటమి ఇచ్చిన ప్రజారంజక సూపర్ సిక్స్ మ్యానిఫెస్టో అన్ని కులాల, మతాల, అన్ని రంగాల ప్రజలను ఆకట్టుకుందని టీడీపీపై ఉన్న నమ్మకంతో కూటమికి ఓట్లతో నీరాజనాలు పలికారన్నారు.

నెలవల విజయశ్రీని కలిసిన టీడీపీ నాయకులు



సూళ్లూరుపేట, మే 14: ఎన్ని కలు పూర్తికావడంతో ఉమ్మడి అభ్యర్థి నెలవల విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యంను మంగళవారం టీడీపీ పట్టణ అధ్య క్షుడు ఏ.రమేష్ ఆధ్వర్యంలో నా యకులు నాయుడుపేటలోని వారి స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలి శారు. ఈ సందర్భంగా వారిని విజయశ్రీ అభినందించారు. గెలు పు తమదేనని అందరూ సంబ రాలకు సిద్ధంగా ఉండాలన్నా రు. టీడీపీ నాయకులు ఈవీవీ సురేష్, మేడా సాయి, వెంకీయాదవ్, రమణయ్య తదితరులు ఉన్నారు.

సూళ్లూరుపేటలో పైచేయి ఎవరిదో?

గెలుపు ధీమాలో టీడీపీ ● వెన్నుపోట్లతో ఆందోళనలో వైసీపీ



తడ, మే 14: పోలింగ్ ముగిసింది. ప్రజలు భారీగా తరలివచ్చి ఓటు వేశారు. ఇది తమకు అనుకూలమని తమదే విజయమని టీడీపీ, వైసీపీలు ధీమాగా ఉన్నా ఉత్కంఠ భరితంగా సాగిన పోరులో పైచేయి ఎవరిదన్నది చర్చనీయాంశమైంది. సూళ్లూరుపేట నియోజవర్గం నుంచి టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్‌తోపాటు 9 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. ప్రధానంగా టీడీపీ, వైసీపీ మధ్యే పోటీ జరిగింది. నియోజక వర్గంలో 6 మండలాలు, రెండు మున్సిపాలిటీల్లో జోరు గా ప్రచారం సాగింది. పోలింగ్ రోజు అదే కొనసా గింది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో వైసీపీకి కొంత అనుకూల ఓటు నమోదైందని అంటున్నా... వైసీపీలోని అసమ్మతి నాయకులు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్లుగా తెలుస్తోంది. ముఖ్యంగా పెళ్లకూరు, సూళ్లూరుపేట, తడ మండలాలలో ఈ ప్రభావం కొంత కనబడింది. దానికి తోడు పట్టణ ఓటర్లల్లో వైసీపీ వ్యతిరేకత టీడీపీకి కలిసొచ్చిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అటు వెన్నుపోట్లు, ఇటు ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఆ వైసీపీకి కొంత ప్రతి కూల ఫలితాన్ని ఇస్తుందని చర్చలు జరుగుతున్నాయి. ఇక టీడీపీ విషయానికి వస్తే మొదట్లో కొంత కుమ్ము లాటలున్నా ఆ తరువాత అవన్నీ సద్దుమణగడం ఆ పార్టీకి కలిసొచ్చింది. గతంలో లాగా కాకుండా పోలింగ్ రోజు వరకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా టీడీపీకి పోలయ్యేలా చేయడంలో సఫలీకృతుల య్యారు. కొన్ని పంచాయతీల్లో టీడీపీకి గుంపగుత్తగా ఓట్లు పడినట్టు సమాచారం. తడ మండలంలోని వాటంబేడు, రామాపురం, వేనాడు, కొండూరు పంచా యతీల తోపాటు నాయుడుపేట, సూళ్లూరుపేట పట్ట ణాల్లో టీడీపీకి భారీ ఆధిక్యత లభించే అవకాశాలు న్నాయి. దీంతోపాటు మహిళా ఓటర్లు పురుషులు కన్నా ఎక్కువగా ఓటు వేయడంతో అది టీడీపీకి అనుకూలమని ఆ పార్టీ భావిస్తోంది. కానీ ప్రభుత్వ పథకాలను అందుకున్న మహిళలు తమవైపే మొగ్గు చూపారని తమ పార్టీలో వెన్నుపోట్లు జరిగినా మహిళల ఓట్లతోనే తాము గెలుస్తామంటూ వైసీపీ సైతం అంటోంది. మరీ ఇక్కడ గెలుపు ఎవరిదన్నది ఈవీఎంలు తెరచినప్పుడే బయటపడుతుంది. అందు కోసం జూన్ 4వ తేదీ వరకు వేచి చూడక తప్పదు.

మొత్తం ఓట్లు 2,42,610
పోలైన ఓట్లు : 2,01,173
పోలింగ్ శాతం : 82.92 శాతం
ఓట్లు వేసిన పురుషులు : 99,372 మంది
ఓట్లు వేసిన మహిళలు : 1,01,801 మంది

● 2019 ఎన్నికల కన్నా ఈ దఫా 1.21 శాతం అధికంగా ఓట్లు పోలయ్యాయి

గెలుపు నిర్ణేతలు మహిళా ఓటర్లే



గూడూరు అర్బన్, మే 14: సార్వత్రిక ఎన్నికల్లో గూడూరు నియోజకవర్గ అభ్యర్థి గెలుపులో మ హిళా ఓటర్లే నిర్ణేతలుగా మారను న్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికల్లో 0.79శాతం పోలింగ్ పెరి గింది. ఈ దఫా ఎన్నికల్లో నియోజక వర్గ పరిధిలో 1,93,458 ఓట్లు పోల్ కాగా అందులో మహిళలు 98,016 మంది తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. 95,436 మంది పురుషులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోగా, పురుషుల కంటే మహిళలు 2,580 మంది అధికంగా ఓటు వేశారు. దీంతో మహిళల ఓటింగ్‌పై ప్రధాన పార్టీల అభ్యర్థులు అంచనాలు వేసుకుంటున్నారు. ప్రధానంగా చంద్ర బాబు ప్రకటించిన సూపర్ సిక్స్‌లో మహాశక్తి పథకం పేరుతో 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500, చదవుకునే పిల్లలకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15 వేలు, ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సి లండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, కలలకు సాకారం చేస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాలను టీడీపీ నాయకులు బలంగా ప్రజల్లోకి తీసకుని వెళ్లడంతో వారిలో చైతన్యం పెరిగి ఓటింగ్‌లో పాల్గొన్నట్లు ఆ పార్టీ వర్గాలు ఆశా భావం వ్యక్తం చేస్తు న్నాయి. యువత, ప్రభుత్వ వ్యతిరేకతతో పాటు మహి ళలు, ఇతర ప్రాంతాల్లో ఐటీ రంగంలో ఉద్యో గాలు చేస్తున్న వారు వ్యయప్రయాసలకోర్చి ఓట్లు వేయ డంతో తమకే లాభిస్తుందని టీడీపీ వర్గాలు ఉన్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిదారులు సహా మహిళలు తమ కు ఓటు వేసినట్లు వైసీపీ వర్గాలు చర్చించుకుంటు న్నారు. మహిళా ఓట్లు తమ పార్టీ విజయానికి సహ కరిస్తాయని అనుకుంటున్నారు. దీంతో గెలుపుపై ఇరు పార్టీల నాయకులు ఎవరికి వారు ధీమాగా ఉన్నారు.

వెంకట'గిరి'ని మహిళలే నిర్ణయించనున్నారు!

తొలిసారి ప్రశాంతంగా జరిగిన ఎన్నికలు

డక్కిలి, మే 14: సార్వత్రిక ఎన్నికల్లో వెంకటగిరి నియోజకవర్గంలో పురుషులు కంటే మహిళలే అధికం గా ఓటుకు పోటెత్తారు. నియోజకవర్గంలో మెత్తం ఓ టర్ల సంఖ్య 2,43,582 కాగా పోలైన ఓట్లు 1,95,606. ఓటు హక్కు వినియోగించుకొన్న పురుషుల సంఖ్య 97,799 కాగా మహిళలు 99,184 మంది, ఇతరులు ముగ్గరు తమ ఓటు హక్కుని వినియోగించుకున్నా రు. మహిళలు ఎవరివైపు మొగ్గు చూపితే వాళ్లే విజే తలుగా నిలవనున్నారని రాజకీయ వర్గాలు విశ్లేషిం చుకుంటున్నాయి. ఇక పోలింగ్ విషయానికి వస్తే ని యోజకవర్గంలో తొలిసారి ఏలాంటి గొడవలు లేకుం డా ప్రశాంతంగా జరిగాయి. అంతే కాకుండా ఈ సారి బెంగళూరు, హైదరాబాద్ తదితర నగరాలనుంచి యువత సొంతూరుకు చేరుకొని ఓటింగ్‌లో పాల్గొన డంతో వీరంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసి ఉంటారని భావిస్తున్నారు.

కొత్త ఈవీఎంలతో ఓటింగ్‌లో జాప్యం

క్యూలైన్లలో నిరీక్షించిన ఓటర్లు

సూళ్లూరుపేట, మే 14: ఈ ఎన్నికల్లో కొత్త ఈవీఎంల వినియోగించడంతో కొత్త ఓటింగ్ ప్రక్రియ కొంత జాప్యమైంది. ఓటు వేసిన తరువాత ఎర్రరంగు బల్బు వెలగడం, బీప్ శబ్దం రావడం కొంత ఆలస్యమైంది. వీవీ ప్యాట్‌లో స్లిప్‌లు వచ్చిన తరువాత బీప్ శబ్దం వచ్చింది. దీంతో చాలా మంది తమ ఓటు పడిందా లేదా నిర్ధరించుకునేందుకు వేచి చూడాల్సి వచ్చింది. దీంతో ఒక ఓటువేసేందుకు ఎక్కువ సమయం పట్టింది. కొన్ని ప్రాంతాల్లో ఈవీఎంలు నెమ్మదిగా ఉండడం కూడా ఓటర్లు నిరీక్షించాల్సి వచ్చింది. ముఖ్యంగా పల్లెల్లో కొంతమంది ఓటర్లు క్యూలైన్లలలో పడిగాపులు కాయలేక వెనుతిరిగి వెళ్లిపోయారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ మూక కత్తితో దాడి



మెడ కింద కట్టుతో గోపి

నాయుడుపేట టౌన్, మే 14: టీడీపీ కార్యకర్త నెలవల గోపిపై వైసీపీ వర్గీయులు కత్తితో దాడి చేశారు. నాయుడుపేట మండలం మాబాకలో ఈ సంఘటన జరిగింది. బాధితుడి కథనం మేర కు... ఎన్నికల సంద ర్భంగా నెలవల గోపి టీడీపీ తరపున ఆటోలో నియోజకవర్గంలో ప్రచారం చేపట్టాడు. సోమవారం ప్రయాణికులను ఎక్కించుకొని ద్వారకాపురానికి వెళ్లాడు. అదే సమయంలో వైసీపీ వర్గీ యులకు గోపి మధ్య వాగ్వాదం జరిగింది. ఈక్రమంలో మంగళవారం గోపి ప్రయాణికులతో మాబాక గ్రామానికి వెళ్లాడు. అక్కడే ఉన్న వైసీపీ వర్గీయులు ప్రతాప్, రంగయ్య, మణి ద్వారకాపురంలో జరిగిన సంఘటనను మనస్సులోపెట్టుకుని మాబాకకు ఎందుకొచ్చావని అడి గారు. దీంతో వారి మధ్య మళ్లీ వాగ్వాదం జరిగింది. ఉన్న ట్టుండి ప్రతాప్, రంగయ్య, మణి కత్తితో గోపీ గొంతుపై తీవ్రంగా గాయపరిచారు. అక్కడే ఉన్న స్థానికులు అడ్డుకుని గాయపడ్డ గోపిని నాయుడుపేట ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు. నాయుడుపేట పోలీస్ స్టేషన్‌లో గోపి ఫిర్యాదు చేశాడు.

నాదస్వర విద్వాంసుడికి టాప్‌గ్రేడ్ సర్టిఫికెట్



సర్టిఫికెట్‌ను అందుకుంటున్న సుధాకర్

చిల్లకూరు, మే 14: మండలంలోని వరగలికి చెందిన నాదస్వర విద్వాంసుడు సుధాకర్ ఏ-టాప్‌గ్రేడ్ సర్టిఫికెట్ ను అందుకున్నాడు. మంగళవారం విజయవాడలోని ఆకాశవాణి విజయవాడ స్టేషన్‌లో డైరెక్టర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. 40ఏళ్లుగా సుధాకర్ ఆకాశవాణిలో పలు గ్రేడ్‌లలో నాదస్వర విద్వాంసుడుగా పని చేస్తున్నాడు. ప్రతిభనుబట్టి ఈ గ్రేడ్‌లను ఆకాశవాణి స్టేషన్ కేటాయిస్తుందన్నారు. దీంతో పలువురు ఆయన్ను అభినందించారు.

గడ్డివామి దగ్ధం

కోట, మే 14: మండల పరిధిలోని రుద్రవరంలో మంగళవారం గడ్డివామి దగ్ధమైంది. కోట దళితవాడకు చెందిన యల్లశిరి మస్తానయ్య తన 5 ఎకరాలలోని గడ్డిని ఆ పొలాల్లో వామిగా వేసి ఉన్నాడు. వామి విద్యుత్ మెయిన్ లైన్ కింద ఉండటంతో షార్ట్‌సర్క్యూట్‌కు గురై కాలి బూడిదైంది. కోట నుంచి ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను ఆర్పేలోగా కాలి బూడిదైంది.

ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో ప్రైవేటు విద్యార్థుల ప్రతిభ

నాయుడుపేట, మే 14: ఏపీఆర్‌జేసీ మంగళవారం వెల్లడించిన పరీక్షా ఫలితాల్లో నాయుడుపేట పట్టణంలోని శస్త్ర విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎస్. వరుణ్ సందేశ్ రాష్ట్రస్థాయి 63వ ర్యాంక్, ఇ.మునితనూజ 527, కె. రుద్రకేశవమూర్తి 727 ర్యాంక్ సాధించారు. వీరిని శ్రీవేమ విద్యాసంస్థల అధినేత పి.శ్రీనివాసులురెడ్డి, శస్త్ర కరస్పాం డెంట్ ఎల్.హరిబాబు అభినందించి ప్రోత్సాహక బహుమ తులను అందజేశారు.

వైసీపీ నాయకుల అరాచకాలు



చికిత్స పొందుతున్న గోపాల్

చిల్లకూరు, మే 14: ఎన్నికల అనంతరం మండలంలో వైసీపీ నాయకుల అరాచకాలకు పాల్ప డుతున్నారు. టీడీపీ నాయ కులపై దాడులకు దిగడం, ఆస్తులకు నష్టం కలిగిస్తున్నారు. మంగళవారం మండలంలోని చింతవరంకొత్తపాళేనికి చెందిన గోపాల్ అనే వ్యక్తిపై వైసీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. స్థానికుల కథనం మేరకు... చితవరంకొత్తపాళేనికి చెందిన గోపాల్ టీడీపీ నాయకుడు. చింతవరంలో ఎరువుల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ ఎన్నికల్లో టీడీపీ తరపున ఆ గ్రామంలో క్రీయాశీలకంగా వ్యవహరించారు. దీంతో మంగళవారం గోపాల్ దుకాణంలో ఉండగా బైక్‌లపై వచ్చిన వైసీపీ నాయకులు దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ గోపాల్‌ను చిల్లకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్సల అనంతరం నెల్లూరులోని ఓప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ మేరకు క్రాంతి, దిలీప్, చెంచయ్యాలు పోలీసులకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రొయ్యలగుంటలో విషం చల్లారు...



చిల్లకూరు మండల టీడీపీ అధ్యక్షుడు ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి రొయ్యగుంటలో గుర్తుతెలియని వ్యక్తులు విషం కలపడంతో నష్టం వాటిల్లింది. ఈ ఎన్నికల్లో టీడీపీ పక్షాన ప్రచారం నిర్వహించడంతో వైసీపీ నాయకులు తిప్పగుంటపాళెంలోని ఆయన రొయ్యలగుంటల్లో సోమవారం విషం కలిపారు. మంగళవారం రొయ్యలను పట్టాల్సి ఉండగా సోమ వారం విషం చల్లడంతో రొయ్యలన్నీ చనిపోయాయి. దీంతో రూ. 15లక్షల వరకు నష్టం వాటిల్లిందని వెంకటేశ్వర్లు రెడ్డి చెప్పారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలింగ్ రోజైన సోమవారం చిల్లకూరులోని 114, 115 బూత్‌లలో వైసీపీ నాయకులు టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ సహా నాయకులపై దాడికి పాల్పడిన సంఘటన విదితమే. ఇకనైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి ఈ తరహా చర్యలకు పాల్పడకుండా వైసీపీ నేతలను కట్టడి చేయాలని వెంకటేశ్వర్లు రెడ్డి కోరారు.

భారీ భద్రత నడుమ ఈవీఎంల తరలింపు





సూళ్లూరుపేట, మే 14: సూళ్లూరుపేట నియోజక వర్గా నికి సంబంధించిన ఈవీఎం లను మంగళవారం భారీ భద్ర త నడుమ ప్రత్యేక వాహనాల్లో జిల్లా కేంద్రం తిరుపతి స్ట్రాంగ్ రూములకు తరలించారు. నియోజకవర్గంలో మొత్తం 304 పోలింగ్ పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలను ఆర్వో చంద్రముని ఆధ్వర్యంలో అసెంబ్లీ, పార్లమెంట్‌కు సంబం ధించిన స్థానిక జూనియర్ కళాశాల మైదానంలోని స్ట్రాంగ్ రూంల నుంచి వేర్వేరు వాహనాల్లో తీసుకెళ్లారు. నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి, సీఐ మధుబాబు, ఎస్‌ఐలు రఘునాథ్, తిరుమలరావు ఆధ్వర్యంలో భద్రతా సిబ్బంది ఈవీఎంల వాహనాల వెంట వెళ్లారు. వీరి వెంట ఏఆర్వో కేవి గోపాలకృష్ణ, తడ, నాయుడుపేట తహసీల్దార్లు ఇక్బాల్, కల్యాణి, ఎన్నికల డీటీ పవన్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ తదితరులు ఉన్నారు.

గూడూరులో...

గూడూరు: గూడూరు నియోజకర్గంలో జరిగిన ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలను మంగళవారం తిరుపతి పద్మావతి కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంకు తరలించారు. నియోజకవర్గంలో ఎన్నికలు ముగిసిన అనంతరం ఈవీఎంలను స్థానిక జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలోని స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు. అక్కడ నుంచి పటిష్ఠ బందోబస్తు నడుమ ప్రత్యేక వాహనంలో తిరుపతి పద్మావతి కళాశాలకు తరలించారు. ఈ ఏర్పాట్లను ఆర్వో కిరణ్‌కుమార్ పర్యవేక్షించారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

● దళిత సంఘాల నాయకుల డిమాండ్



ఆందోళన చేస్తున్న దళిత, ప్రజా సంఘాల నాయకులు

వెంకటగిరి, మే 14: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు, ఈఎస్‌ఎస్ డిగ్రీ కళా శాల సమీపంలో ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దోషులను 24 గంటల్లోగా అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఘటనా స్థలం నుంచి క్రాస్‌రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దోషులను వెంటనే అరెస్టు చేయని పక్షం లో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. ప్రభుత్వ నిధులతో విగ్రహాన్ని యథాతథంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అం బేడ్కర్ ధర్మపోరాట సమితి నాయకుడు గోపాల్, నవజీవన్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు సహదేవయ్య, ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకుడు గద్దల మునయ్య, 5వ వార్డు కౌన్సిలర్ నారి శేఖర్, ఏఐటీయూసీ నాయకుడు జాన్, నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, డి.రామకృష్ణ, పి.ధనుంజయ, ఎం.సు రేష్, కె.రవి, చంద్ర, వెంకటేశ్వర్లు, చెంచుకృష్ణయ్య, సురేష్, వెంకటాద్రి, నర సింహులు, భాస్కర్, న్యాయవాది వేణు, చిట్టేటి రాజా పాల్గొన్నారు.

చెట్టుకు ఉరి వేసుకున్న గుర్తు తెలియని వ్యక్తి

తడ, మే 14: గర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరేసుకున్నారు. తడ బస్టాండ్ కూడలిలో కారుషెడ్ వెనుక సోమవారం రాత్రి సుమారు 65 సం వత్సరాల గుర్తుతెలియని వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుడు. మంగళవారం ఉద యం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దించి పరిశీలించారు. ఎటువంటి ఆధారాలు లభించలేదు. దీంతో మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నాంచారమ్మ గుడి హుండీ ధ్వంసం

డక్కిలి, మే 14 : మండలంలోని కుప్పాయపాళెం సమీంపలో కొలువై ఉన్న నాంచారమ్మ గుడిలో గుర్తు తెలియని దుండగులు మంగళవారం తెల్ల వారు జామున తలుపులను ధ్వంసం చేసి హుండీని పగులగొట్టి నగదును చోరీ చేసినట్లు గ్రామస్తులు పోలీసుకు ఫిర్యాదు చేశారు. హుండీలో ఉన్న సుమారు రూ.20 వేల నగదు సహా అమ్మవారి సూలాన్ని ఎత్తుకెళ్లారు.

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సరళి

గూడూరులో 78.90శాతం పోలింగ్ నమోదు

గూడూరు, మే 14: గూడూరు నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. ఓటర్లు 6గంటల సమయం దాటినా ఓట్లు వేసేందుకు వేచివుండడంతో పోలింగ్ ప్రక్రియ అర్ధరాత్రి వరకు కొనసాగింది. ఈ ఎన్నికల్లో పురుషుల ఓట్లు 1,19,164, మహిళల ఓట్లు 1,26,007, ఇతరుల ఓట్లు 34 ఉండగా మొత్తం 2,45,205 మంది ఓటర్లుగా ఉన్నారు. సోమవారం 95,436 మంది పురుషులు, 98,016 మంది మహిళలు, 13 మంది ఇతరులు... మొత్తం 1,93,458 మంది ఓటు వేశారు. 78.90శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు.

కోటలో 79.87 శాతం పోలింగ్

కోట, మే 14: కోట మండలంలోని 21 పంచాయతీలకు గాను 52 పోలింగ్ కేంద్రాల్లో 79.87 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దారు నాగరాజారావు, ఎంపీడీవో శంకరయ్య మంగళవారం తెలిపారు. మండలంలో 42,134 మంది ఓటర్లు ఉండగా, 33,815 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 20,390మంది పురుష ఓటర్లుకు గాను 16,457 మంది, 21,740 మంది మహిళా ఓటర్లకు గాను 17,358 మంది ఓటు వేశారు.

మా అభ్యర్థిదే గెలుపు!

గ్రామాల్లో రచ్చబండ చర్చలు

ఓజిలి, మే 14: ఎన్నికల సమరం ముగిసింది... మెల్లగా ఎన్నికల వేడి కూడా చల్లబడుతోంది... బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో భద్రంగా ఉండగా వారి గెలుపుపై రచ్చబండ సమావేశాలకు తెరలేచింది. ఓజిలి మండలంలో వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్య, కూటమి అభ్యర్థిగా టీడీపీ నుంచి నెలవల విజయశ్రీ గెలుపుపై చర్చిస్తున్నారు. తమ విజయం వెనుక జగనన్న పథకాలే శ్రీరామ రక్షగా ఉంటాయని అధికార పార్టీ నా యకులు అంటుండగా ప్రభుత్వ వ్యతిరేకత, అవినీతి అక్రమాలు తమ అభ్యర్థి గెలుపు నల్లేరుమీద నడకేనంటున్నారు. కురుగొండ, ఓజిలి, ఆరిమేనిపాడు, సగుటూరు, ఇనుగుంట, అత్తివరం, కరబల్లవోలు, గ్రద్దగుంట, చిల్లమానుచేను, వెంకటరెడ్డిపాళెం సచివాలయాల పరిధిలో పంచాయతీల్లో బూత్‌ల వారీగా పోలింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. వృద్ధులు కూడా చర్చల్లో పాల్గొంటూ తమ అనుభవాలను పంచుకుంటున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి అన్ని ఎన్నికల్లో ఓజిలి మండలంలో ఆ పార్టీ మెజారిటీని నిలబెట్టుకోగా వైసీపీ ఏర్పాటైన నాటినుంచి బీటలు పడ్డాయి. ఈనేపథ్యంలో ప్రస్తుత ఎన్నికల్లో తిరిగి టీడీపీ పూర్వవైభవం సంతరించుకుంటుందని రచ్చబండ చర్చ జరుగుతోంది.

పల్లె ఓటర్లలో చైతన్యం... ఫలించిన అధికారుల ప్రయత్నం

సూళ్లూరుపేట, మే 14: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ల చైతన్యంతో గ్రామీ ణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం బాగా పెరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా సూళ్లూరుపేట మండలంలో దాదాపు 17 పోలింగ్ కేంద్రాల్లో 90 శాతం మించి ఓట్లు పోలయ్యాయి. ఓటింగ్ శాతం పెంచేందుకు అధికారులు చేసిన ప్రయత్నాలు బాగా ఫలించాయి. తీర గ్రామాలైన కొడిడి, పేర్నాడు, కడపత్ర, రాగన్నపట్టెడ గ్రామాల్లో రోడ్డు వేస్తేనే ఓటేస్తాం లేదంటే బహిష్కరిస్తామన్న ప్రజలు ఓటు వేసేందుకు బారులు తీరి మరీ వేయడం విశేషం. ఈ గ్రామాల్లో ఆర్వో చంద్రముని, ఏఈఆర్వో కేవి గోపాలకృష్ణ, పోలీసులు అక్కడ గ్రామాల్లో తిరిగి మరీ ఓటు విలువ గురించి తెలియజేసి అందరూ ఓటింగ్‌లో పాల్గొనే విధంగా అవగాహన కల్పించారు. అదే విధంగా పడమలి పల్లెల్లో కూడా బాగా ఓటింగ్ శాతం పెరిగింది. మండలంలో సామంతమల్లాం 96.21 శాతం అధికంగా పోలింగ్ నమోదు అయ్యింది. అదే విధంగా కుదిరిలో 95.68, పెరిమిటిపాడు 94.54, కొణ్ణంబట్టు 94.24, సుగ్గుపల్లి 94.09, ఉగ్గుముడి 92.75, వెలగలపొన్నూరు 92.68, కొరిడి 90.40, దామరాయి 92.11, రాగన్నపట్టెడ 91.52, మన్నెముత్తేరి 92.18, కొమ్మినేనిపల్లి 90.88, మతకాముడి 91.13, మంగానెల్లూరు 90.74, దేగలపాలెం 91.34 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. మండలంలో 33 పోలింగ్ కేంద్రాలు ఉండగా 17 పోలింగ్ కేంద్రాల్లో 90 శాతం పైగా పోలింగ్ నమోదు కావడం విశేషం. పోలింగ్ 90 శాతం పై బడి నమోదైన గ్రామాలన్ని టీడీపీకి కలిసి వచ్చే అవకాశాలు స్పష్టంగా కనబడుతున్నాయి. దాదాపు 17 గ్రామాల్లో అధికంగా పోలింగ్ నమోదు కాగా అందులో మన్నెముత్తేరి మినహా మిగిలిన అన్ని గ్రామాల్లో టీడీపీకి మంచి పట్టుంది.